
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

బుధవారం 12 ఫిబ్రవరి 2025 | 5



వండిన చికెన్ మాత్రమే తినాలి

చికెన్ తింటే.. 75 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వరకూ వండినది మాత్రమే తీసుకోవాలి. పచ్చిమాంసం తినకూడదు. హాఫ్ బాయిల్డ్ గుడ్లు తినకూడదు. కోడ్లు, మాంసం చేతితో తాకిన తర్వాత శుభ్రంగా కడుక్కోవాలి. గుడ్లు, చికెన్ వేర్వేరుగా ఉంచాలి. ఇతర ఆహార పదార్థాలతో కలపకూడదు. ముడి చికెన్, కోడిగుడ్లు తాకిన ఉపకరణాలను బాగా శుభ్రం చేయాలి. కోళ్లు మరణించి ఉంటే వాటిని జాగ్రత్తగా నిర్మూలన చేయాలి. రవాణా చేసే డబ్బాలు తరచూ శుభ్రం చేయాలి. తూర్పు గోదావరి జిల్లాలో ఎవరికైనా జ్వరం, జలుబు, తలపోటు, ఒళ్లనొప్పులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందికి చెప్పాలి.

- డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో, తూర్పుగోదావరి

సీజ్ చేసిన బియ్యం వేలం

103.450 మెట్రిక్ టన్నుల వేలానికి చర్యలు

జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసిన బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించడం చట్ట విరుద్ధమని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. జిల్లాలోని పలు వ్యాపార సంస్థలకు చేరుకున్న పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి ఎంఎల్ఎస్ పాయింట్లలో భద్రపరిచినట్లు చెప్పారు. మండపేట మండలం వేములపల్లి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద 82.944 మెట్రిక్ టన్నులు, అంబాజీపేట మండలం ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద 20.506 మెట్రిక్ టన్నుల సీజ్‌చేసిన బియ్యం ఉందన్నారు. సీజ్ చేసిన బియ్యాన్ని వేలం వేయడానికి నిర్ణయించామని పాటలో పాల్గొనదలిచినవారు రూ.2 లక్షలు డిపాజిట్‌గా జాయింట్ కలెక్టర్ పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ తీసి ఈ నెల 19వ తేదీ ఉదయం 11.30లలోపు కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో వేలం నిర్వహిస్తామన్నారు.



కోడికి.. కష్టమొచ్చింది!

బర్డ్ ఫ్లూ వైరస్.. భయం..భయం

నిన్నటివరకూ కళకళ..నేడు వెలవెల

బర్డ్ ఫ్లూ సోకిన ఫారం వద్ద అధికారుల పరిశీలన

కానూరులో డీఎంహెచ్‌వో పరిశీలన

కోడికి కష్టమొచ్చింది.. వైరస్ దెబ్బకు ఓడిపోయింది.. కోడిని చూస్తేనే జనం పరుగుపెడుతున్నారు.. రెండు రోజుల కిందట వరకూ కోడిని చూసి లొట్టలేసిన వారు.. ప్రస్తుతం చికెన్ తినాలా! వద్దా!.. అనే మీమాంసలో పడిపోయారు.. ఎందుకంటే బర్డ్ ఫ్లూ భయపెడుతోంది.. తినకపోవడమే మంచిదనే అభిప్రాయంలో జనం ఉన్నారు.. దీంతో మంగళవారం చికెన్ దుకాణాలు వెలవెలబోయాయి.. పౌల్ట్రీ రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.. ఉభయగోదావరి జిల్లాల్లో పౌల్ట్రీ యజమానులు లబోదిబోమంటున్నారు.. అయితే యానిమల్ హజ్బెండరీ అధికారులు మాత్రం ఉడకబెట్టిన తరువాత చికెన్ తిన్నా ఇబ్బందేంలేదని చెబుతున్నారు.. గతంలోనూ ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ వచ్చింది.. అప్పుడు ఎవరికైనా సోకిందా అని ప్రశ్నిస్తున్నారు.. దీంతో పచ్చిమాంసం తింటే ప్రమాదమే కానీ.. ఉడకబెట్టిన తరువాత తింటే ప్రమాదమేం లేదనేది చాలామంది వాదన..



కానూరులో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

తూర్పున అప్రమత్తం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లా కానూరు అగ్రహారంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కానూరు అగ్రహారంలో రెడ్ అలర్ట్ ప్రకటించడంతోపాటు ప్రజలను అప్రమత్తం చేశారు. వాస్తవానికి జనవరి నుంచే ఇక్కడ కోళ్లు చనిపోతున్నట్టు చెబుతున్నారు. సుమారు 54 వేల కోళ్లు మృతిచెందిన తర్వాత పౌల్ట్రీ యజమాని జిల్లా యంత్రాంగానికి సమాచారం ఇవ్వడంతో కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు శాంపిల్స్ తీసి పరీక్షించడంతో బర్డ్‌ఫ్లూ బయటపడింది. ఇప్పటి వరకూ మొత్తం 84 వేల కోళ్లు ఇక్కడ మృతి చెందినట్టు ఓ అధికారి తెలిపారు. మంగళవారం వైద్య సిబ్బంది మిగిలిన 2,976 కోళ్లకు మత్తు ఇచ్చి గోతుల్లో పూడ్చేశారు. గ్రామ ప్రజలు పెంచుకుంటున్న సుమారు 45 కోళ్లను కూడా స్వాధీనం చేసుకుని, వాటిని కూడా పూడ్చిపెట్టారు. ఈ గ్రామంలో 2700 మంది జనాభా ఉన్నారు. మూడు ప్రధాన కోళ్ల ఫారాలతోపాటు మరో ఆరు వరకూ ఫారాలు ఉన్నాయి. జిల్లా యంత్రాంగం పూర్తిగా ఇక్కడ దృష్టి కేంద్రీకరించింది. వైద్యశాఖ అధికారులు ప్రతి మనిషి నుంచి శాంపిల్ తీసుకుని ల్యాబ్‌కు పంపించారు. ఊరిలో ఎవరూ కోడి మాంసం, గుడ్లు తినవద్దని టాంటాం వేసినట్టు సర్పంచ్ దాసం వెంకన్న తెలిపారు. కిలో మీటరు లోపు రెడ్ అలర్ట్ ప్రకటించడంతో ఇక్కడ అందరూ అప్రమత్తంగా ఉండేటట్టు చర్యలు తీసుకున్నారు. ఇక్కడ కోళ్లఫారాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఎటువంటి వైరస్ లక్షణాలు కనిపించలేదని అధికారులు చెబుతున్నారు.



అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

నిడదవోలు నియోజకవర్గం పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల పరిధిలోని 34 గ్రామాల్లో ఇంటింటికీ సర్వే చేసి బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాల ఎవరికైనా ఉన్నాయేమో అనే సర్వే చేయడం కోసం 64 వైద్య బృందాలను నియమించాం. సీతానగరం మండలంలో కూడా సర్వే చేయిన్నాం. ఇతర యానిమల్స్‌కు వైరస్ సోకకుండా వాక్సినేషన్ చేయిస్తున్నాం. అపోహలు వద్దు, జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని, ఇంతవరకూ జిల్లాలో మనుషులెవరికి ఈ వ్యాధి సోకినట్టు దాఖలాలు లేవు. కానూరు నుంచి కోళ్లు, గుడ్లు బయటకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం కలెక్టర్ కానూరులో పర్యటించారు.

- మూడు జిల్లాలపై తీవ్ర ప్రభావం
- పడిపోయిన అమ్మకాలు
- ఒక్కసారిగా దిగజారిన గుడ్డు ధర
- లబోదిబోమంటున్న పౌల్ట్రీ రైతులు
- అప్రమత్తమైన అధికారులు
- ఎక్కడికక్కడ కట్టడికి చర్యలు
- కాకినాడలో ర్యాపిడ్ టీమ్‌లు
- పచ్చి మాంసం తింటేనే ప్రమాదం
- ఆఫ్ బాయిల్డ్ ఎగ్ తినకూడదు
- ఉడకబెడితే తినొచ్చంటున్న వైద్యులు

కోనసీమలో ఆనవాళ్లు లేవు : కలెక్టర్

కోనసీమ జిల్లాలోని 18 పౌల్ట్రీల్లో 57 లక్షలకు పైగా కోళ్లు ఉన్నాయి.. ఇప్పటివరకు బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లను గుర్తించలేదు.. పక్క జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ ఉన్న దృష్ట్యా పౌల్ట్రీ యజమానులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి. వారం రోజులపాటు జిల్లాలో అంగన్‌వాడీలు, పాఠశాలలు, హాస్టళ్లకు కోడిగుడ్ల సరఫరా నిలిపివేయాలి. అమలాపురం కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులతో బర్డ్ ఫ్లూపై సమీక్షించి పలు సూచనలు చేశారు.



కోనసీమలో వైరస్ లేదు!

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బర్డ్‌ఫ్లూ ప్రచారంపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమకు చెందిన యజమానులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి జిల్లా పరిధిలో ఎక్కడా బర్డ్ ఫ్లూ ప్రభావం లేనప్పటికీ ప్రచార ప్రభావంతో ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దాంతో కోళ్ల ఆధారంగా నడిచే నాన్‌వెజ్ హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో చికెన్ వినియోగం తగ్గుముఖం పట్టింది. చికెన్ దుకాణాలపై ఈ ప్రభావం పడి అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. జిల్లావ్యాప్తంగా మండపేట, రామచంద్రపురం, కొత్తపేట నియోజకవర్గాల పరిధితోపాటు వివిధ ప్రాంతాల్లో 57 లక్షలకుపైగా కోళ్ల పెంపకం జరుగుతున్నట్టు పశు సంవర్థకశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో వ్యాక్సినేషన్ ఇవ్వకపోవడం వల్లే కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకి ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. కోనసీమ జిల్లాలో కోళ్లకు వ్యాక్సినేషన్ చేయడం వల్ల ఆ తరహా వ్యాధిలేమీ సోకలేదనేది అధికారుల వాదన. ఒక కోడికి వేసే వ్యాక్సిన్ ఖర్చు రూ.2 నుంచి రూ.10 అవుతుంది. దీంతో కొందరు వ్యాక్సినేషన్ వేయకపోవడంతో ఈ తరహా వైరస్ సోకుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పౌల్ట్రీ సంఘ యజమానులు మాత్రం కోనసీమ జిల్లాలో ఎక్కడా వైరస్ లక్షణాలు లేవని.. చికెన్ వినియోగించవచ్చని ప్రచారం చేస్తున్నారు.

కాకినాడలో అలెర్ట్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

బర్డ్‌ఫ్లూతో కోళ్లు మృత్యువాత పడుతున్న నేపథ్యంలో కాకినాడ జిల్లా పశుసంవర్థక శాఖ అప్రమత్తమైంది. జిల్లావ్యాప్తంగా ఉన్న కోళ్ల ఫారాల్లో తనిఖీలు చేయాలని సిబ్బందిని ఆదేశించింది. ఈ మేరకు ప్రతి మండలానికి రెండు చొప్పున ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను ఏర్పాటు చేసింది. ఇందులో ఆయా సచివాలయాల్లో పనిచేసే పశుసంవర్థక శాఖ సిబ్బందిని భాగస్వామ్యం చేసింది. ఈ బృందాలు మంగళవారం నుంచి గ్రామాల్లో కోళ్లఫారాలను తనిఖీ చేయించింది. ఎక్కడైనా కోళ్లు మృత్యువాత పడినట్టు గుర్తిస్తే తక్షణం ఆ ప్రాంతానికి కిలోమీటరు పరిధిలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించింది. దీంతో జిల్లాలో మంగళవారం మొత్తం 42 బృందాలు కోళ్లఫారాలను పరిశీలించాయి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 82 కోళ్ల ఫారాల్లో 62 లక్షల లేయర్, బాయిలర్ కోళ్లు ఉన్నాయి. వీటిలో ఎక్కువ సంఖ్యలో కోళ్లు మృతి చెందినట్టు గుర్తిస్తే ఆయా ఫారాల యాజమాన్యాలు తక్షణం సమాచారం ఇవ్వాలని జిల్లా పశు సంవర్థకశాఖ ఆదేశించింది. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో ప్రజల్లోనూ భయాందోళనలు వ్యక్తమవుతుండడంతో ఎక్కడికక్కడ ప్రజల్లో అవగాహన వచ్చేలా చైతన్యం చేయాలని అధికారులు ఆదేశించారు.

కాకినాడ జిల్లాలో అంగన్‌వాడీల గుడ్డుకు ఓకే



కాకినాడ జిల్లాలో స్త్రీశిశు సంక్షేమశాఖ పరిధిలో అంగన్‌వాడీలకు సరఫరా అవుతున్న గుడ్లను చిన్నారులకు తినిపించవచ్చా లేదా అనే దానిపై ఆ శాఖ అధికారులు మంగళవారం విషయాన్ని పశుసంవర్థకశాఖ దృష్టికి తీసుకువెళ్లారు. ఉడికించిన గుడ్లను తినడం వల్ల ఎలాంటి వైరస్ ముప్పు ఉండదని స్పష్టం చేయడంతో ఈ జిల్లాలో అంగన్‌వాడీలకు గుడ్ల సరఫరా యథాతథం చేశారు. బర్డ్‌ఫ్లూ ఆందోళనల నేపథ్యంలో మంగళవారం గుడ్డు ధర పతనమైంది.

గుడ్డు.. బ్యాడ్

బర్డ్‌ఫ్లూ ప్రభావం కోళ్ల పెంపకందార్లను కొంత దెబ్బకొట్టింది. ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రభావం నుంచి బయటపడతామని కోళ్ల రైతులు ఆశిస్తున్నారు. గుడ్ల పరిశ్రమకు సంబంధించి ఒక్కొక్క గుడ్డు రైతు ధర సోమవారం రూ.4.25 వరకు ఉండగా మంగళవారం రూ.3.95కి తగ్గించి ట్రేడర్లు కొనుగోలు చేశారు. ఒకేరోజు 30 పైసలు పడిపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. కిలో రూ.200 నుంచి రూ.220 వరకు విక్రయాలు సాగిన బాయిలర్‌కు కోడిమాంసం ఒక్కసారిగా రూ.180కి పడిపోయింది. కొన్నిచోట్ల కొనేవారు లేక చికెన్ దుకాణాలు తెరవలేదు.

ఎండలొచ్చేశాయి.. వైరస్‌తో ఇబ్బంది ఉండదు..

ప్రస్తుతం కొద్దిచోట్ల మాత్రమే బర్డ్‌ఫ్లూ ఉంది. గోదావరి జిల్లాల్లో ఇతర ప్రాంతాలన్నీ బాగానే ఉన్నాయి. చలికాలంలో మాత్రమే వైరస్ ప్రబలి కోళ్లు చనిపోతాయి. ప్రస్తుతం ఎండలు కాస్తున్నాయి కాబట్టి పౌల్ట్రీ పరిశ్రమకు నష్టమేమీ ఉండదు.

- పడాల సుబ్బారెడ్డి, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ సెక్రటరీ

ఉడికించిన తరువాత తింటే ఏం కాదు..

బాగా ఉడికించిన తరువాత చికెన్, గుడ్లు తింటే వైరస్ ప్రభావం ఉండదు. ఈ రంగంపై అపోహలు తొలగేలా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాలి. వైరస్ కారణంగా కొన్నిచోట్ల జరిగిన పొరపాట్లకు మొత్తం పరిశ్రమ నష్టపోయే పరిస్థితి సరికాదు. - మేకా శ్రీనివాస్, పౌల్ట్రీ యజమాని, మండపేట



ఘనంగా భీమేశ్వరుని రథోత్సవం

6లో

ద్రాక్షారామకు తరలివచ్చిన భక్తులు

అంతర్వేదిలో వైభవంగా గ్రామోత్సవాలు

వార్త..6లో

టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వరకు జరిగే పదో తరగతి పరీక్షలను సజావుగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించాలన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లాలో 110 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, 19,217 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు కలెక్టర్ తెలిపారు. వీరిలో 19,010 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా 207 మంది ప్రైవేటు విద్యార్థులున్నారు. రెగ్యులర్ పదో తరగతి పరీక్షలతో పాటు 1195 మంది ఓపెన్ స్కూలు విద్యార్థులకు కూడా జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రశ్నాపత్రాలను అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌కు పరీక్షలకు వారం రోజుల ముందే చేరుకుంటాయన్నారు. అనంతరం రూట్ ఆఫీసర్లు, ఎంఈవోల పర్యవేక్షణలో జిల్లాలోని 22 మండలాల్లోని పోలీసు స్టేషన్లకు తరలించి అక్కడి నుంచి పరీక్ష రోజున సంబంధిత సీఎస్డీవోలు ప్రశ్నాపత్రాలను పరీక్షా కేంద్రాలకు తీసుకువెళతారని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా కలెక్టర్‌కు వివరించారు. స్ట్రాంగ్‌రూమ్, పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పోలీసులను ఆదేశించారు. పరీక్షల సమయంలో ఆయా కేంద్రాల పరిసరాల్లో జిరాక్సు షాపులు మూసివేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొరకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు సరైన సమయంలో పరీక్షాకేంద్రాలకు చేరుకునే విధంగా బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఏపీఈపీడీఈఎల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష ముగిసిన తరువాత జవాబు పత్రాలను నిర్దేశించిన స్పాట్ వాల్యుయేషన్ సెంటర్‌కు చేర్చేలా పోస్టల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేస్తూ పదో తరగి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. సమావేశంలో డీఆర్వో రాజకుమారి, అడిషనల్ ఎస్పీ ఏవీఆర్ పీబీ ప్రసాద్, అమలాపురం, రామచంద్రపురం ఆర్డీవోలు కొత్త మాధవి, బి.అఖిల, జిల్లా రవాణాధికారి ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో ఆత్మహత్యాయత్నం భగ్నం

వార్త..7లో



కొమరగిరిలో నెరలు తీస్తున్న పొలం

చేనుకు దాహం..

సాగునీటి ఇబ్బందులతో రైతులు విలవిల

దాళ్వా పంటకు సాగునీటి గండం ఏర్పడింది. నాట్లు వేసిన ప్రారంభంలోనే సాగునీటి సమస్య తలెత్తడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఎరువుల వినియోగానికి అవసరమైన నీరు లేకపోవడంతో రైతులు కలవరపడుతున్నారు. రబీలో సకాలంలో ఎరువులు, పురుగుమందులు వాడకపోతే పంట దిగుబడి దిగజారుతుంది. సాగునీటి యాజమాన్యం కూడా అత్యంత కీలకం. ఈ ఏడాది నాట్లు వేసి నెల రోజులు కాకుండానే పొలాలకు సాగునీటి ఎద్దడి ఏర్పడింది.

ఐ.పోలవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమరగిరి, మంగాపాలెం, జి.మూలపొలం, తిళ్లకుప్ప తదితర ప్రాంతాలకు సాగునీరందక పొలాలు బీటలు వారుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ప్రారంభంలోనే నీటి పరిస్థితి ఇలా ఉంటే ముందు ముందు ఇంకెలా ఉంటుందోనని రైతులు భయపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పంటకాల్వల్లో నీరున్నా వాటికి అనుసంధానంగా ఉన్న పిల్లకాల్వలకు నీరందడం లేదు. మండలంలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో పొలాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. మండలంలో వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన పొలాల్లో నీరు లేక కలుపు మొక్కల ప్రభావం ఎక్కువగా ఉంది. కలుపుతీతకు పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. సాగునీటి ఎద్దడి సమస్యపై అధికారులు తక్షణం స్పందించి, వంతులవారీ విధానం ద్వారా అన్ని ప్రాంతాలకు సకాలంలో సాగునీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.



అడుగంటిన పంట బోదెలు

వలకట్లతో ఏటా కష్టాలు



గుండెపూడి వద్ద తూడుతో డ్రెయిన్

అల్లవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు సాగునీటి కష్టాలతో విలవిల్లాడుతున్నారు. ప్రస్తుత దాళ్వా వరి సాగులో సాగునీరు అందక వందలాది ఎకరాల్లో ముంపునీరు దిగక అవరోధాలు ఎదురయ్యాయి. అల్లవరం మండలంలో మేజర్, మైనర్, రెవెన్యూ డ్రెయిన్లు, ప్రధాన పంటకాల్వలు, అనుబంధ కాల్వల్లో తూడు, గుర్రపుడెక్క పెరిగి మూసుకుపోయి ముంపునీరు దిగక రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీరు అందించాల్సిన పంటకాల్వలు ఉనికిని కోల్పోతున్నాయి. వాసాలతిప్ప, లోయర్‌కౌశిక, పంచనది, కుమ్మరికాల్వ, దేశికోడు మేజర్ డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోయి పల్లపు ప్రాంతాల్లో ముంపు తగ్గని పరిస్థితి ఎదురైంది. సుమారు 40 కిలోమీటర్లు మైనరు రెవెన్యూ డ్రెయిన్లలో ఇదే పరిస్థితి. డ్రెయిన్లలో అనధికార వలకట్లతో ఏటా ముంపు సమస్య తప్పడం లేదు. ఆక్వా చెరువుల నుంచి రైతులు సజ్జును డ్రెయిన్‌లోకి తోడేస్తున్నారు. అల్లవరం మండలం బోడసకుర్రు, బెండమూర్లంక, సామంతకుర్రు, తుమ్మలపల్లి, తాడికోన, తూర్పులంక తదితర పంటకాల్వల్లో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోయి రైతులకు సాగునీటి కష్టాలు ఎదురయ్యాయి. పలుచోట్ల రైతులు ఇంజన్లు పెట్టి బోదెల ద్వారా నీటిని తోడుకుంటున్నారు. ఆక్వా చెరువుల్లో ఉప్పునీటిని పంటకాల్వల్లోకి తోడేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. డ్రెయిన్లలో తూడు వలన అడ్డంకులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని డ్రెయిన్స్ ఏఈ కె.సునీత అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపి డ్రెయిన్లు, పంటకాల్వల్లో మోక్షం కల్పించాలని, వలకట్లను శాశ్వతంగా తొలగించాలని రైతులు కోరుతున్నారు.

సాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వ్యవసాయం, ఇరిగేషన్, డ్రైన్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రబీ సాగులో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లవరం, ఉప్పలగుప్తం, మామిడికుదురు, ముమ్మిడివరం మండలాల్లోని శివారు భూముల్లో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి నీటి వినియోగదారుల సంఘాల సభ్యులతో సమావేశమై ఏ ప్రాంతంలో సాగునీటి ఇబ్బందులు ఉన్నాయో గుర్తించాలన్నారు. ప్రస్తుతం వంతుల విధానంలో సాగునీరు అందిస్తున్నామని ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వంతుల విధానంలో భాగంగా ఏయే ప్రాంతాల్లో ఎప్పుడెప్పుడు సాగునీరు అందుతుందో ముందస్తుగానే సమాచారం అందించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సాగునీటి సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులను గుర్తించి ఈ నెల 13లోపు క్రాస్ బండ్లు ఏర్పాటు అవసరమున్న డ్రైన్లు, కాల్వల వివరాలను సమర్పించాలన్నారు. క్రాస్ బండ్లు ఏర్పాటుచేసి సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.శ్రీనివాసరావు, డ్రైన్స్ డీఈ కిశోర్ పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కోలాహలంగా.. భీమేశ్వరుని రథోత్సవం





- ద్రాక్షారామ వీధుల్లో వైభవంగా రథోత్సవ వేడుక
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారి రథోత్సవం మంగళవారం కోలాహలంగా జరిగింది. మధ్యాహ్నం కల్యాణ మూర్తులైన మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామి వార్లను పుష్పాలంకృత రథంపై అర్చకస్వాములు అధిష్ఠింపజేశారు. ధూప సేవ అనంతరం 2.55 గంటలకు ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు.

ఉత్సాహంగా..

స్వామివారి రథం ఆలయం వద్ద నుంచి చంద్ర వీధి గుండా వెలంపాలెం చేరుకుని సూర్యవీధి మీదుగా మెయిన్‌రోడ్డు చేరుకుంది. తదుపరి మార్కెట్, యానాం సెంటర్ నుంచి వేగాయమ్మపేట చేరుకుంది. హరహరమహాదేవ శంభోశంకర అంటూ వందలాది మంది భక్తులు ఉత్సాహంగా రథయాత్రలో పాల్గొన్నారు. రథంలో ఆశీనులైన కల్యాణమూర్తులు స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో భక్తులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కూటమి నాయకుడు వాసంశెట్టి సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆస్థాన పూజ

రథం వేగాయమ్మపేటలోని ఆస్థాన మండపం వద్దకు చేరుకుంది. సాయంత్రం 6.30 గంటలకు కల్యాణమూర్తులకు ఆస్థాన పూజ జరిగింది. నీరాజన మంత్రపుష్పంతో ముగిసింది. కార్యక్రమంలో వాడ్రేవు సుందర రత్నాకరరావు, ఈవో అల్లువెంకట దుర్గాభవానీ, ఆలయ సిబ్బంది, ఆస్థాన పండితుడు దేవులపల్లి ఫణిరామకృష్ణ, అర్చకులు, వేదస్వస్తి వాచకులు, భక్తులు పాల్గొన్నారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ పర్యవేక్షణలో ఎం.వెంకటనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎం.లక్ష్మణ్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.రత్నాలరావు పర్యవేక్షణలో ఏఈ మేడిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ కండక్టర్లు, వైర్లు తొలగించారు. రథోత్సవం అనంతరం పునరుద్ధరించారు.





రాజాధిరాజ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

వైభవంగా గ్రామోత్సవాలు

అంతర్వేది, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు అల్లూరి రామరాజు, వెంకటసత్యనారాయణరాజుల నిర్మితమైన రాజాధిరాజా వాహనంపై స్వామివారు గ్రామ పురవీధుల్లో ఊరేగారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు ధూపసేవ, 7 గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులచే నిర్మితమైన అశ్వ వాహనంపై స్వామివారి గ్రామోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గోవిందనామ, నృసింహ నామ స్మరణల నడుమ గ్రామోత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమాల్లో ఆలయ ఛైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, డీఎస్పీ ఎస్.మురళీమోహన్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, ఉత్సవ సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం శ్రీస్వామివారికి చక్రస్నానం జరగనుంది. గరుడ పుష్పక వాహనంపై స్వామివారి ఆలయం వద్ద నుంచి ఉదయం 8 గంటలకు సముద్రం వద్దకు బయలుదేరి ప్రత్యేక పూజలు అనంతరం ధ్వజారోహణ జరుగుతుంది. ప్రత్యేక బృందాలతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఆలయం వద్ద క్యూలైన్లు, సముద్ర స్నానాల వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేసినట్టు ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. సముద్రం వద్ద సుమారు వంద మీటర్ల మేర ప్రత్యేక కర్రలతో బారికేడ్లు స్నానమాచరించే ప్రదేశం వద్ద ఏర్పాట్లు చేశారు. ఆర్డీవో అఖిల, ఏసీ సత్యనారాయణతో కలిసి చక్రస్నానం, వసంత మండపం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, ఈవోపీఆర్డీ సూర్యనారాయణ, డీటీ భాస్కర్, తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు, సీఐ నరేష్‌కుమార్, ఎస్ఐ దుర్గాశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చోర సంవాదం



చోర సంవాదం ఘట్టం నిర్వహిస్తున్న దృశ్యం

అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 7.30 గంటలకు కేశవదాసుపాలెం వాస్తవ్యులు ఉండపల్లి, బెల్లంకొండ కుటుంబీకులచే నిర్మితమైన అశ్వవాహనంపై స్వామివారిని 16 మండపాల స్తంభం వద్దకు తీసుకువచ్చారు. ఆలయ అర్చకుల సమక్షంలో చోర సంవాదం వేడుకలు నిర్వహించారు. దారి దోపిడీ దొంగకు, భగవంతునికి మధ్య జరిగిన సంభాషణను అర్చకులు తమిళంలో చదివారు. దారి దోపిడీ దొంగగా మారిన పరాకాలుడు అనే మహారాజు మారు వేషంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహుడిని కూడా దోచుకుంటాడు. మహా విష్ణువు ఆయనను మంచివాడిగా చేసి ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేసిన పరకాలుడు పేరును తిరుమంగల్వార్‌గా మార్చి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తారు. ఈ సంభాషణను సున్నాలు, పన్నాలు పేరుతో వైష్ణవోపేతంగా ఆలయ స్థానాచార్యులు, వేద పండితులు, అర్చకులు పఠించారు. ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి వెంకట శ్రీనివాస్, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, వేదపండితులు చింతా వెంకట శాస్త్రి, అర్చక స్వాముల సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ , ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కలిదిండి కుమారరామగోపాలరాజా బహదూర్, ఉండపల్లి, బెల్లంకొండ కుటుంబసభ్యులు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

18న ఉమ్మడి జిల్లా స్థాయి సంఘాల సమావేశాలు

జడ్పీ సీఈవో లక్ష్మణరావు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ 1 నుంచి 7 వరకు స్థాయి సంఘాల సమావేశాలు జరుగనున్నాయని జడ్పీ సీఈవో వీవీఎస్.లక్ష్మణరావు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోపు జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశాలకు ప్రజాప్రతినిధులు, సంబంధిత స్థాయి సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని ఓ ప్రకటనలో కోరారు.

భక్తులకు సులభతరంగా దర్శనాలు

పాదగయలో మహాశివరాత్రి ఏర్పాట్లపై పరిశీలన

పిఠాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా విరాజిల్లుతున్న కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి మహాశివరాత్రి పర్వదినాల్లో తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు సులభతరంగా దర్శనం, పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించడం పూర్తయ్యే విధంగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. మున్సిపల్ కమిషనరు నామా కనకారావు, పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం, పుష్కరిణి, భక్తులు రాకపోకలు సాగించే ముఖద్వారం, బైపాస్‌రోడ్డు వైపు మార్గాలను పరిశీలించారు. క్యూలైన్లు ఎక్కడ నుంచి ఏర్పాటు చేయాలనే అంశంపై పరిశీలన చేశారు. వాహనాలను పార్కింగ్ చేసే నిమిత్తం 6 ప్రాంతాలను ప్రాథమికంగా గుర్తించారు. నేరుగా దర్శనాలకు వెళ్లే భక్తులు, స్నానాలు మాత్రమే ఆచరించే భక్తుల కోసం ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు మణికుమార్, జానీభాషా తదితరులున్నారు.



పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై పరిశీలన చేస్తున్న కమిషనరు, ఈవో, సీఐ తదితరులు

బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ విజేత ఉమ్మడి జిల్లా జట్లు

రెండవ స్థానంలో కృష్ణా జిల్లా జట్లు



బాలురు, బాలికల విభాగాల్లో విజేతగా నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల సభ్యులు

పిఠాపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాతబస్టాండు వద్ద గల మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలోని బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. 4రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా మంగళవారం రాత్రి పది గంటల వరకూ జరిగిన ఫైనల్స్ ఉత్కంఠగా సాగాయి. బాలబాలికల విభాగాల ఫైనల్స్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లు తలపడ్డాయి. రెండు విభాగాల్లోనూ ఉమ్మడి తూర్పు బాలబాలికల జట్లు విజేతలుగా నిలవగా, ఉమ్మడి కృష్ణా జిల్లా జట్లు రెండవ స్థానంలో నిలిచాయి. విజేతలకు పిఠాపురం నియోజకవర్గ జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావు, పిఠాపురం అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథం, జాతీయ ఉమెన్స్ టీం కోచ్ శ్రీనివాసరావు షీల్డులు, బహుమతులు అందజేశారు.

నిరంతర కృషి ద్వారానే సత్ఫలితాలు

డాక్టర్ ఉమర్‌ఆలీషా

ముగిసిన పీఠం వార్షిక మహాసభలు



పిఠాపురంలో కుట్టుమిషన్లు అందజేస్తున్న పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా

పిఠాపురం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సామాన్యుల నుంచి తత్వవేత్తలు, సమాజంలో ఎంత ప్రముఖులైనా కాలపరీక్షలకు అతీతులు కారని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా అన్నారు. ఆధ్యాత్మిక తాత్త్వికజ్ఞానం పెంపొందించుకోవడం ద్వారానే ఈ పరీక్షలను తట్టుకోగలమని చెప్పారు. పిఠాపురం పట్టణ శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో 3 రోజులు పాటు జరిగిన పీఠం వార్షిక జ్ఞాన చైతన్య మహాసభలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. ముగింపు సభలో భక్తులనుద్దేశించి ఆయన అనుగ్రహభాషణ చేస్తూ నిరంతర కృషి ద్వారానే సత్ఫలితాలు పొందగలమన్నారు. మానసిక తృప్తి మానవుడిని సంస్కారవంతుడిని చేస్తుందని తెలిపారు. మంచి చెడులను విశ్లేషించే శక్తి ఆధ్యాత్మిక జ్ఞానం ద్వారా లభిస్తుందని చెప్పారు. ప్రతి చిన్న విషయాన్ని ఆసహనానికి గురవుతూ మానవుడు అనేక సమస్యలను కొని తెచ్చుకుంటున్నాడని తెలిపారు. ధ్యాన, జ్ఞాన మంత్రసాధనలతో కూడిన త్రయీ సాధన ద్వారా సహనశక్తిని అలవర్చుకుని దీనిని అధిగమించివచ్చని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటాలని సూచించారు. విశ్వమానవ శ్రేయస్సుకు పాటుపడుతూ పీఠం ద్వారా అందిస్తున్న సేవలను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రశంసించారు.

కుట్టుమిషన్లు, వీల్‌చైర్లు అందజేత

ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా కుట్టుమిషన్లు, వీల్‌చైర్లు, ఎస్ఆర్ఐ సభ్యులు పేరూరి విజయరామ సుబ్బారావు, సన దంపతులు భవిత దివ్యాంగుల శిక్షణా కేంద్రం కొరకు ఏర్పాటు చేసిన ఎలక్ట్రోస్టిమ్యులేటర్లను పీఠాధిపతి డాక్టర్, ఉమర్‌ఆలీషా, ఇతర ప్రముఖులు అందజేశారు. పీఠం రూపొందించిన కరదీపకలు, గ్రంథాలను ఆవిష్కరించారు. పీఠం నిర్వహిస్తున్న తాత్విక బాలవికాస్ ద్వారా ఆధ్యాత్మిక శిక్షణా తరగతుల్లో శిక్షణ పొందిన చిన్నారుల ప్రసంగాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు వైడీ రామారావు, ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, గోదావరి డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మేనేజర్ నందిని పాండా, గీతావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, అహ్మద్ ఆలీషా, హుస్సేన్‌షా, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఆకుల రవితేజ, సెంట్రల్ కమిటీ సభ్యులు డాక్టర్ పింగళి ఆనందకుమార్, ఏవీవీ సత్యనారాయణ, ప్రసాద వర్మ, కె.స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ఆరికిరేవులలో సినిమా షూటింగ్

కొవ్వూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో రామ్ పోతినేని 22వ సినిమా షూటింగ్ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో జరిగింది. మైత్రీ మూవీస్ బ్యానర్‌లో నిర్మిస్తున్న ఈ సినిమాకు ఇంకా పేరు పెట్టలేదు. మంగళవారం ఆరికిరేవుల స్నానఘట్టం, గోదావరి నది వద్ద సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సినిమాకు మహేష్ బాబు.పి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే. రావు రమేష్, బ్రహ్మానందం, హర్షవర్ధన్‌లు నటిస్తున్నారు. వివేక్ మార్విన్‌లు మ్యూజిక్ అందజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతం బ్యాక్‌డ్రాప్‌గా సాగే చిత్రం కావడంతో మరో నెల రోజులపాటు కొవ్వూరు పరిసర ప్రాంతాలో చిత్ర నిర్మాణం జరుగుతుందని యూనిట్ సభ్యులు తెలిపారు.



కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో జరుగుతున్న షూటింగ్

సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించాలి

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



కాకినాడలో హాకీ టోర్నమెంట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడ హాకీ పట్ల జిల్లా యువతలో ఆసక్తి, అనురక్తి పెంపొందేరీతిలో కాకినాడ డీఎస్ఏ స్టేడియంలో జాతీయ సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను కోరారు. మంగళవారం స్థానిక క్రీడా ప్రాధికార సంస్థ మైదానాన్ని సందర్శించి 2024-25 ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జాతీయ క్రీడ అయిన హాకీ పట్ల దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాచుర్యం, ప్రోత్సాహం కల్పించేందుకు కాకినాడ డీఎస్ఏ మైదానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్ట్రో టర్ఫ్ ఫీల్డ్‌ను అభివృద్ధి చేసి, జాతీయ స్థాయి హాకీ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా తొలిసారిగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ పురుషులు, మహిళల హాకీ టోర్నమెంట్ ఈనెల 15 నుంచి 28వరకు 2వారాలపాటు డీఎస్ఏ మైదానంలో జరుగుతుందన్నారు. పోటీల్లో పా ల్గొనేందుకు విచ్చేసే క్రీడాకారులకు తగు సదుపాయాలతో బస, రవాణా, వారి అలవాట్ల కనుగుణమైన ఆహారం ఏర్పాటు చేయాలన్నా రు. పోటీలను తిలకించేందుకు వచ్చే ప్రజల కోసం స్టేడియం చేరువలో పార్కింగ్ సదుపాయం కల్పించాలన్నారు. స్టేడియంలో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు, సీపీవో త్రినాథ్, డీఎస్డీఏవో శ్రీనివాస్‌కుమార్, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి తదితరలున్నారు.

డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాకు నీరు విడుదల

మోతుగూడెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టాకు మంగళవారం 3వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. గోదావరి డెల్టా రబీ పంటలకు సీలేరు కాంప్లెక్స్ నుంచి 10టీఎంసీల నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు జెన్‌కో ఉన్నతాధికారులను కోరడంతో తమ అధికారుల ఆదేశాల మేరకు డొంకరాయి జలాశయం నుంచి 3వేల క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పత్తి చెయ్యకుండా నేరుగా గోదావరి డెల్టాకు విడుదలు చేస్తున్నామన్నారు. 10 టీఎంసీల నీటిని 3వేల క్యూసెక్కుల చొప్పున 40రోజులు పాటు నీటి విడుదల కొనసాగించాలని ఇరిగేషన్ అధికారులు కోరినట్టు ఈఈ బాలకృష్ణ తెలిపారు. అలాగే కాంప్లెక్సు పరిధిలోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా మరో 4వేల క్యూసెక్కుల నీరు కూడా గోదావరి డెల్టాకు చేరుతుందని తెలిపారు. డొంకరాయి జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్న సందర్భంగా జలాశయం దిగువన ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని... నదీ ప్రవాహాన్ని దాటుట, దాని పరిసరాలకు వెళ్లరాదని, ప్రజలు, పెంపుడు జంతువులు ఏమైనా ఉన్నా డొంకరాయి జలాశయం దిగువకు రాకుండా చర్యల చేపట్టి అప్రమత్తంగా ఉండాలని అధికారులు డొంకరాయి జలాశయం దిగువ ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.



డొంకరాయి జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ఇరానీ గ్యాంగ్ అరెస్టు

- రాజమహేంద్రవరం పరిసరాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆటకట్టు
- వలవేసి పట్టేసిన తూర్పు పోలీసులు
- 380 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం



వివరాలు తెలియజేస్తున్న తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిశోర్

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పరిసరాల్లో దోపిడీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలు ముఠా సభ్యులైన ఇరానీ గ్యాంగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన రాజమహేంద్రవరంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు.రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో ఇటీవలజరుగుతున్న చైన్ స్నాచింగ్ కేసులపై ప్రత్యేకంగా దృష్టిసారించి నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు, నగరం చుట్టూ పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. కొంత సమాచారం ఆధారంగా ఒడిశాలోని మారుమూల ప్రాంతంలోని ఇరానీగ్యాంగ్ ఈ దురాగతాలకు పాల్పడుతున్నట్టు నిర్ధారించుకున్నారు. వారిని అదుపులోకి తీసుకోవడానికి ఒక ప్రత్యేక బృందాన్ని పంపించారు. ఈలోపు గామన్ బ్రిడ్జిపై వాహన తనిఖీలు చేస్తుండగా కొందరు పట్టుబడ్డారు. వారిని ప్రశ్నించగా నేరం అంగీకరించారని ఎస్పీ తెలిపారు. దొంగతనాలకు పాల్పడుతున్న ఒడిశాలోని నౌపడ జిల్లా కరియర్ రోడ్‌కి చెందిన జహీర్ హుస్సేన్ అబూ తాలిబ్, మహ్మద్ షబ్బార్, ఖాసీం అలీ, కిస్మత్ అలీ, దిల్‌రుబా బేగం సోహైల్, అబ్బాస్ అలీ అనే ఆరుగురిని అరెస్ట్ చేశామన్నారు. అదే ప్రాంతానికి చెందిన హైదర్ అలీ, జావెద్ అలీ అనే ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. చాలాఏళ్ల కిందట ఇరాన్‌నుంచి వచ్చి తిక్రీ అనే ప్రాంతంలో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నందున వాళ్లను ఇరానీ గ్యాంగ్‌గా పిలుస్తున్నారని చెప్పారు. వాళ్లపై ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో కేసులు ఉన్నాయన్నారు. అక్కడ వీళ్లను మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌గా పోలీసులు ప్రకటించారన్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో జరిగిన దొంగతనాలకు సంబంధించి 382 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేశ్‌బాబు, రాజమహేంద్రవరం త్రీటౌన్ సీఐ వి.అప్పారావు, కొవ్వూరు రూరల్ సీఐ విజయ్ బాబు, రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బాలశౌరి, సీఐ రాంబాబు, రాజమహేంద్రవరం త్రీటౌన్ ఎస్‌ఐ ఎండీ జుబేర్, స్పెషల్ టీం, టెక్నికల్ టీం సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేశారు.



కేసు ఛేదనలో ప్రతిభ కనబర్చిన రాజమహేంద్రవరం సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేశ్‌బాబు, కొవ్వూరు రూరల్ సీఐ విజయ్‌బాబు, రాజానగరం సీఐ వీరయ్యగౌడ్, రాజమహేంద్రవరం త్రీటౌన్ సీఐ అప్పారావులకు జ్ఞాపిక అందజేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

యువశక్తిని మేల్కొల్పేందుకు..

దేశవ్యాప్త స్కేటింగ్ యాత్ర

- కాశీ నుంచి 20 రాష్ట్రాల మీదుగా 10,550 కి.మీ. యాత్ర
- గిన్నీస్ రికార్డ్ లక్ష్యంగా యువతి ప్రయత్నం
- కాకినాడ జిల్లా కత్తిపూడిలో ఘన స్వాగతం



కత్తిపూడిలో యాత్రకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు, సంఘ సభ్యులు

శంఖవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): భారతీయ యువశక్తిని మేల్కొల్పేందుకు, మహిళాసత్తాను చాటేందుకు కాశీనుంచి కాశీకి దేశవ్యాప్తంగా స్కేటింగ్ యాత్ర చేస్తున్న సోనీ చౌసియా అనే యువతికి కాకినాడ జిల్లా కత్తిపూడిలో ఘనస్వాగతం లభించింది. స్కేటింగ్ చేస్తూ వచ్చిన ఆమెకు మంగళవారం కాకినాడ జిల్లా స్కేటింగ్ సంఘ సభ్యులు, కత్తిపూడి గ్రామస్తులు ఆహ్వానం పలికారు. 20 రాష్ట్రాల మీదుగా 10,550కిలోమీటర్లు సాగే ఈ యాత్ర కత్తిపూడికి చేరుకుంది. ఈ సందర్భంగా సోనీ చౌసియా మాట్లాడుతూ మే 12కి కాశీకి చేరుకునేలా ప్రణాళికలు చేసుకున్నామని, గిన్నీస్ బుక్‌లో రికార్డ్ లక్ష్యంగా ఈ యాత్రను చేస్తున్నానని తెలిపారు. తనకు అపూర్వ స్వాగతం తెలిపిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ మురమళ్ల శివయ్య, ప్రత్తిపాడు కండ కార్యవాహ మొండి వీరవెంకటరమణ, జిల్లా ప్రచారప్రముఖ్ సత్యలింగేశ్వరావు పాల్గొన్నారు.

సత్యదేవా నిత్యాన్నదానానికి రూ.2లక్షల విరాళాలు



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత హరికృష్ణ దీప్తి



పీఆర్‌వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత దీప

అన్నవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి మంగళవారం ఇద్దరు దాతలనుంచి రూ.2లక్షలు విరాళాలుగా సమకూరాయి. విజయవాడకు చెందిన హరికృష్ణ దీప్తి, సుశ్రిత్‌కృష్ణ ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా చెన్నయికి చెందిన వెంకటరావు, దీప దంపతులు పీఆర్వో కృష్ణారావుకు అందించారు. దాతలను వారు అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. అన్నదాన విభాగ సూపరింటెండెంట్ రామకృష్ణ తదితరులున్నారు.

న్యాయం చేయాలంటూ ప్రియుడి ఇంటి ముందు యువతి ఆందోళన

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పాశర్లపూడిలో ఘటన



ప్రియుడి ఇంటి ముందు నిరసన తెలియచేస్తున్న యువతి బంధువులు

మామిడికుదురు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించిన వ్యక్తి పెళ్లికి ముఖం చాటేశాడని పేర్కొంటూ ఓ యువతి తన ప్రియుడి ఇంటిముందు ఆందోళన చేపట్టింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలంలోని పాశర్లపూడిలో మంగళవారంజరిగిన ఈఘటన చర్చనీయాంశమైంది.

దీనికి సంబంధించిన కాట్రేనికోన చెయ్యేరు పండువారిపేటకు చెందిన బాధిత యువతి తెలిపిన వివరాలివి. పాశర్లపూడి బాడవ చింతలమెరక ప్రాంతానికి మోకా ప్రవర్ష్, తాను కాకినాడలో చదువుకుంటూ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నామని తెలిపింది. తమ ప్రేమ విషయం ఇంట్లో అందరికీ తెలుసునని, ఇంట్లో వాళ్లను ఒప్పించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇప్పుడు ముఖం చాటేస్తున్నాడని ఆందోళన వ్యక్తం చేసింది. తమ ప్రేమ విషయమై రెండు, మూడుసార్లు పెద్దల సమక్షంలో చర్చలు జరిగాయని, రెండు నెలలుగా ప్రవర్ష్ తనను దూరం పెట్టి అందుబాటులో లేకపోవడంతో 15 రోజుల కిత్రం కాట్రేనికోన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని బాధితురాలు పేర్కొంది. ప్రవర్ష్ తండ్రి పెద్దల సమక్షంలో పెళ్లికి అంగీకరించినప్పటికీ తర్వాత అతడిని కుటుంబసభ్యులు కట్టడి చేయడంతో తనను దూరం పెట్టాడని, తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు తన కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం ప్రవర్ష్ ఇంటి ఎదుట బంధువులు, సన్నిహితులతో కలిసి ఆందోళన చేపట్టింది. అతడితో తనకు పెళ్లి చేయకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటానని బాధితురాలు హెచ్చరించింది. విషయం తెలుసుకున్న నగరం ఎస్‌ఐ చైతన్యకుమార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆమె కుటుంబ సభ్యులతో చర్చించి ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెళ్లి విషయంపై పెద్దలతో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. ఒకదశలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి వారిని సముదాయించడంతో పరిస్థితి సద్దుమణిగింది. మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని, నిరసన విరమించుకోవాలని కోరడంతో యువతి బంధువులు ఆందోళన కార్యక్రమాన్ని విరమించి వెనుదిరిగారు.

సాంకేతికత సాయంతో కాపాడారు

- ఆత్మహత్య చేసుకుంటున్నట్టు కోనసీమకు చెందిన వ్యక్తి సెల్ఫీ వీడియో
- అన్నవరంలోని ఓ లాడ్జీలో ఉన్నట్టు సాంకేతికత ద్వారా కనుగొన్న పోలీసులు
- సురక్షితంగా బంధువులకు అప్పగింత

అన్నవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సాంకేతికత ఒక నిండుప్రాణాన్ని కాపాడింది. దీనికి పోలీసుల కృషి తోడైంది. కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వీరవల్లిపాలేనికి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సెల్ఫీ వీడియో స్నేహితులకు పంపాడు. ఈ సమాచారాన్ని అతడి కుటుంబసభ్యులు పి.గన్నవరం సీఐకు తెలపడంతో సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారా అతడు అన్నవరంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడినుంచి అన్నవరం ఎస్‌ఐకి సమాచారమివ్వగా ఆయన లాడ్జిల యూనియన్ వాట్సాప్ గ్రూప్‌లో సెల్ఫీ వీడియో ఫార్వర్డ్ చేశారు. ఏ లాడ్జి నుంచి వీడియో తీసుకున్నాడనేది తెలియపరచాలని అప్రమత్తం చేయడంతో నిమిషాల వ్యవధిలో ఒక లాడ్జి యజమాని స్పందించి తన పక్కనున్న లాడ్జిలో తీసిన వీడియో అని బదులిచ్చాడు. వెంటనే అక్కడికి వెళ్లి తలుపుతట్టి సంబంధిత వ్యక్తిని బయటకి రప్పించాడు. వెంటనే అన్నవరం ఎస్‌ఐ హరిబాబు సిబ్బందితో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తిని స్టేషన్‌కి తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు అన్నవరం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. వెంటనే స్పందించిన ప్రైవేటు లాడ్జి యజమానిని ఎస్‌ఐ హరిబాబు అభినందించారు. కాగా, ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడిన పోలీసు యంత్రాంగాన్ని కోనసీమ జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.

అన్నవరంలో వాట్సాప్ ద్వారా వ్రతాలు, దర్శన సేవలు

అన్నవరం,ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ సేవల్లో అన్నవరం ఆలయానికి సంబంధించి సేవలను అందుబాటులో ఉంచినట్లు ఈవో వీర్ల సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు 9552300009 వాట్సాప్ నెంబరుకు హాయ్ అని టైప్ చేస్తే సేవలకు రుసుం డిజిటల్ చెల్లింపు ద్వారా తీసుకుని వ్రతం టిక్కెట్లు, దర్శనం టిక్కెట్లు, విరాళాలు చెల్లింపు చేసుకోవచ్చునన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని తమ ఇంటి నుంచే బుక్‌చేసుకుని అన్నవరం ఆలయానికి విచ్చేసి బుకింగ్ రశీదు ప్రింట్ తీసుకుని కార్యాలయంలో అందజేస్తే ఎంచుకున్న సేవలను అందిస్తామన్నారు.

గోదావరిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

రావులపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గౌతమి గోదావరిలో వంతెన సమీపంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని రావులపాలెం ఎస్‌ఐ చంటి తెలిపారు. స్థానిక వీఆర్వో సమాచారం మేరకు మృతదేహాన్ని పరిశీలించగా మృతురాలు 5.4 అంగులాల పొడవు, 6 అంగులాల జుట్టు, నీలి రంగు చీర, జాకెట్టు కలిగి ఉందన్నారు. చర్మం పూర్తిగా కమిలిపోయి గుర్తుపట్టకుండా మారిపోయిందని, ప్రమాదవశాత్తూ నదీలో జారి పడి ఇక్కడకు ప్రవాహానికి కొట్టుకొచ్చి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని బంధువుల గుర్తింపుకోసం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

మహిళ వేషంలో బంగారం చోరీ

- వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు

గండేపల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి స్త్రీ వేషం ధరించి ఒక పురుషుడివద్ద రూ.లక్ష విలువచేసే బంగారు గొలుసు అపహరించాడు. దీనిపై గండేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ మేరకు మంగళవారం నిందితుడిని అరెస్టు చేశారు. అతడివద్ద సొత్తు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ ఎవరైనా ట్రాన్స్‌జండర్లుగా జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల జాతీయ రహదారిపై, షాపుల వద్ద ఎదుటివారిని అవమానపరిచేలా మాట్లాడినా, భౌతికదాడికి పాల్పడినా, అశ్లీల నృత్య ప్రదర్శనలు చేసినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- ప్రేమించిన బాలిక కుటుంబీకులు తల్లిదండ్రులను అవమానించారని ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం

కొవ్వూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రేమించిన బాలిక కుటుంబీకులు తల్లిదండ్రులను అవమానించారని మనస్తాపం చెందిన ఓ యువకుడు చీరతో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లికి చెందిన చిట్ర సూర్య రాజమహేంద్రవరంలో డిగ్రీ రెండో ఏడాది చదువుతున్నాడు. వాడపల్లికి చెందిన బాలికతో కొంతకాలంగా ప్రేమ వ్యవహారం ఉంది. విషయం తెలుసుకున్న బాలిక తల్లి, అమ్మమ్మ, మేనమామ, తాతయ్య అతడిని దీనిపై ప్రశ్నించారు. సూర్య ఇంట్లో కూడా విషయం చెప్పడంతో తండ్రి చిట్ర శివ, అతని భార్య బాలిక ఇంటికి వెళ్లారు. దీంతో బాలిక తరుపు వారు, రాజమహేంద్రవరానికి చెందిన న్యాయవాది అందరూ కలిసి వీరిని దుర్భాషలాడి, అసభ్యంగా ప్రవర్తించారు. తనవల్ల తల్లిదండ్రులు అవమానపడ్డారని మనస్తాపం చెందిన సూర్య సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా హాలులో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు బాలిక కుటుంబసభ్యులు ఐదుగురిపై పట్టణ ఎస్‌ఐ కె.జగన్మోహనరావు కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు ప్రేరేపించడం, మహిళపట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, బెదిరించడం, కొట్టడం, మూకుమ్మడి దాడి చేయడంపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. గ్రామంలో ముందుజాగ్రత్తగా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

పిఠాపురంలో 160 క్వింటాళ్ల రేషన్‌బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యంతో సీఐ, ఎస్‌ఐలు

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలో మంగళవారం రెండు చోట్ల పోలీసులు దాడులు నిర్వహించి 160 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాల్లో రేషన్‌బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, రూరల్ ఎస్‌ఐ గుణశేఖర్ దాడులు నిర్వహించారు. బి.ప్రత్తిపాడులో రైసుమిల్లు ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో లారీ, వేన్‌ల ద్వారా రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ, వేన్‌ల్లో ఉన్న 144 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఊటా రాజు, శివశంకర్, వెలుగుల చినబాబ్జిలపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఎఫ్‌కేపాలెంలో కీర్తి సూరిబాబు ఒక నివాసంలో నిల్వ ఉంచిన 16 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వీరిని కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు.

దుర్గాడలో 25.50క్వింటాళ్లు స్వాధీనం

గొల్లప్రోలురూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలో రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. వేన్‌లో తరలిస్తున్న 25.50క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వేన్‌ను సీజ్ చేశారు. గ్రామానికి చెందిన కర్రి కృష్ణపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొత్తగా పది ఓపెన్ ఇసుక ర్యాంపులు

- నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలో నోటిఫికేషన్
- మైనింగ్ ఏడీ ఫణిభూషణ్‌రెడ్డి

కొవ్వూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలాఖరు నాటికి తూర్పుగోదావరి జిల్లాలో కొత్తగా 10 ఓపెన్ ర్యాంపులకు నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు మైనింగ్ ఏడీ డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. కొవ్వూరు మండలం ఆరికిరేవులలో ఇసుకర్యాంపు ఏర్పాటుపై స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక లారీలకు తప్పనిసరిగా టార్పాలిన్ కట్టాలని, రోడ్లపై ఇసుక జారి పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఆరికిరేవుల, చిడిపి, పక్కిలంక, తాడిపూడి, పురుషోత్తపల్లి, మునికూడలి, పెండ్యాల, కాటవరం, శింగవరం గ్రామాల్లో ఓపెన్ ర్యాంపులకు ఫిబ్రవరి నెలాఖరు లే దా మార్చి మొదటి వారంలో నోటిఫికేషన్ ఇస్తామన్నారు. జిల్లాలో ప్రసుత్తం 9 డీసిల్టేషన్ ర్యాంపులు నడుస్తున్నాయని, రేపటిలో గా మిగిలిన 8 డీసిల్టేషన్ ర్యాంపులకు అ నుమతులు ఇస్తామన్నారు. ఓపెన్ ర్యాంపు లు 12నడుస్తున్నాయన్నారు. వేమగిరి, జీడి గుంట ర్యాంపులను రద్దు చేశామన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మండపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి రైల్వే స్టేషన్‌కు కూతవేటు దూరంలో మంగళవారం రైలుపట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలుఢీకొని వ్యక్తి మృతి చెందాడు. రాజమహేంద్రవరం రైల్వే పోలీసుల సమాచారం ప్రకారం... మృతి చెందిన వ్యక్తికి 40 ఏళ్లు ఉంటాయని, నీలం రంగు షర్ట్, నలుపురంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహం గుర్తుపట్టలేనివిధంగా ఉందని రైల్వే ఎస్‌ఐ పి.లోవరాజు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో మాజీ ఉపరాష్ట్రపతి కుటుంబీకుల పూజలు

అన్నవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వారికి వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ తిరుమలరావు

జేఈఈ మెయిన్స్‌లో 'తిరుమల' ప్రభంజనం

రాజమహేంద్రవరంరూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్ సెషన్-1లో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ ఈడబ్ల్యుఎస్ కోటాలో ఆలిండియా టాపర్‌గా నిలిచారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఇప్పటివరకు అందిన ఫలితాల్లో నలుగురు విద్యార్థులు కోటిపల్లి యశ్వంత్‌సాత్విక్, కోడూరి యశ్వంత్ రాజా, పి.శరత్ సంతోష్, దువ్వ ఆశిష్ సాయి శ్రీకర్ 99.99 పర్సంటైల్ సాధించారని, నవులూరి ఆశ్రిత్ సాయి, కంచుమర్తి ఫణీత్ , ఎన్.ఉదయ్ పవన్ 99.98 పర్సంటైల్ సాధించారన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరక్టర్లు, ప్రిన్సిపాల్‌తో కలిసి తిరుమలరావు అభినందించారు.

మోసగించిన కేసులో రెండేళ్ల జైలు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురి నుంచి సొమ్ములు తీసుకుని మోసగించిన కేసులో నేరారోపణ రుజువు కావడంతో రెండేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధిస్తూ ముమ్మిడివరం జుడీషియల్ ఫస్టక్లాస్ మెజిస్ట్రేట్ రహ్మతుల్లా మంగళవారం తీర్పు చెప్పారు. ఉప్పలగుప్తంమండలం భీమనపల్లికి చెందిన జంపనగణేష్‌రాజు 2017లో ఉద్యోగాలు ఇప్పిస్తానని పలువురినుంచి డబ్బు తీసుకుని మోసగించగా ముమ్మిడివరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో పైవిధంగా తీర్పు వచ్చిందని ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు.

ప్రత్తిపాడులో ఘనంగా మేరీమాత యాత్ర మహోత్సవాలు

- ఉమ్మడి తూర్పు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన క్రైస్తవ భక్తజనం



ప్రత్తిపాడులో మేరీమాతను ఊరేగిస్తున్న భక్తులు



మరేగిరి కొండపై ప్రార్థనలు చేస్తున్న భక్తులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో మేరీమాత యాత్ర మహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. నాలుగు రోజులుగా మేరీమాత ఉత్సవాలు కొనసాగుతూ ఉన్న ముగింపురోజు మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నలుమూలల నుంచి మరేగిరికి భక్తజనం పోటెత్తడంతో ఆ పరిసరాలు జనసందోహంతో కిటకిటలాడాయి. మరేగిరిపై కొలువైఉన్న మేరీమాతను, లూర్ధుమాతను, యాకుల మాత, ఏసుప్రభువు విగ్రహాలను భక్తులు సందర్శించారు. అనంతరం కొండపై నిర్వహించిన క్రైస్తవప్రార్థనలో వేలాదిమంది పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు రజక జూబ్లియేరియన్స్, సాలురు, రాజమహేంద్రవరం, అరకు, విజయనగరాలకు చెందిన గురులు పి.జోసెఫ్, ఈ.రవీంద్రకుమార్, ఎం.జేసుదాసు, ఎం.లూర్థులు మాట్లాడుతూ ప్రపంచ శాంతికి మానవాళి, జీవన ఉన్నతికి, ఐక్యతకు క్రీస్తు సందేశాలు దోహదపడతాయన్నారు. భక్తులకు నిర్వాహకులు, స్థానిక సేవా సంస్థల కార్యకర్తలు అన్నదానం చేసి మజ్జిగ, మంచినీరు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

చోరీ కేసులో బంగారు ఆభరణాల రికవరీ

రాజానగరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాల అపహరణ కేసులో నిందితుడిని అరెస్టు చేసి ఆభరణాలను రాజానగరం పోలీసులు రికవరీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం వెలుగుబంద గ్రామంలో జరిగిన ఈచోరీకి సంబంధించి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవెలుగుబంద గ్రామానికి చెందిన ప్రగడకృష్ణ గతేడాది ఏప్రిల్ 1న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి రాజమహేంద్రవరం ఆస్పత్రికి వెళ్లారు. మర్నాడు ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం, బీరువా తాళాలు బద్దలు కొట్టి బీరువాలో భద్రపర్చిన 249.5 గ్రాముల పలు రకాలైన బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లుగా గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ పర్యవేక్షణలో రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుడు అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం గొంటువానిపాలెం గ్రామానికి చెందిన చిలపనశెట్టి సన్యాసిరావు అలియాస్ చిన్న అనే వ్యక్తిని నిందితుడిగా నిర్ధారించి అరెస్టు చేశామని, అతని నుంచి చోరీకి గురైన 156.625 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఇంకా మిగిలిన 66 గ్రాముల బంగారు ఆభరణాలు ముథూట్ గోల్డ్ పాయింట్ షాపునుంచి రికవరీ చేయాల్సి ఉందన్నారు.సంఘటనా స్థలం సమీపంలో నమోదైన సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. నిందితుడిపై పలు పోలీస్టేషన్లలో 27కుపైగా కేసులు నమోదయ్యాయన్నారు. నిందితుడిని పట్టుకోవడంతో పాటు బంగారు ఆభరణాలను రికవరీ చేసిన సీఐతో ఎస్‌ఐ మనోహర్, హెచ్‌సీ అమ్మిరాజు, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విశాఖకు చెందిన దాడి సురేష్ మురమళ్ళ వీరేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు మంగళవారం రూ.30వేలు, మురమళ్లకు చెందిన తోట వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులు రూ.10,116 విరాళం ఇచ్చారు. దాతలకు దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు.

లూర్థుమాత వార్షికోత్సవం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సరిపల్లిలో గెడ్డం సుబ్బారావు, మేరీఅంజలి నిర్మించిన లూర్థుమాత దేవాలయంలో మంగళవారం వార్షికోత్సవం నిర్వహించారు. సర్పంచ్ గెడ్డం స్వరూపా సురేష్‌బాబు ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు ఈవేడుకల్లో పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు మార్పుపై ప్రజల అభ్యంతరం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం 4వ వార్డులో ఉన్న డంపింగ్ యార్డును 8వ వార్డు సూరాయిచెరువులోకి మార్పు చేసే ఆలోచన పట్ల ఆ గ్రామ ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆ గ్రామ ప్రజలు మంగళవారం కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు మెమొరాండం ఇచ్చారు. ముమ్మిడివరం నగర పంచాయతీకి సంబంధించిన చెత్తను 4వ వార్డులో కొత్తలంక రోడ్డు పక్కన ఉన్న డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అయితే అక్కడ చెత్త వేయడం వల్ల ఆ చుట్టుపక్కల నివాసం ఉన్నవారికి ఆ రోడ్డులో రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో డంపింగ్ యార్డును ఊరికి దూరంగా ఏర్పాటు చేయడానికి ఎనిమిది ఎకరాలు భూమి అవసరమని రెవెన్యూశాఖను నగర పంచాయతీ కోరింది. ఇప్పటివరకు అనుకూలమైన భూమి లభించలేదు. అయితే డంపింగ్ యార్డుకు సోమిదేవరపాలెం, సూరాయిచెరువులో ఉన్న నాలుగు ఎకరాల 81 సెంట్ల భూమిని ప్రభుత్వానికి ఇచ్చేందుకు ఒక రైతు ముందుకు వచ్చాడు. అయితే ఆ భూమిని సేకరించేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. ఆ స్థలం వద్ద 8, 9వార్డులకు సంబంధించి 300మంది ప్రజలు, అయినాపురానికి చెందిన వంద మంది కూడా ఆ ప్రాంతంలోనే నివాసం ఉంటున్నారు. డంపింగ్ యార్డును ఏర్పాటుచేస్తే మరింత ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, డంపింగ్ యార్డును ఊరికి దూరంగా, నివాస గృహాలకు దూరంగా ఏర్పాటు చేయాలని ఆ గ్రామానికి చెందిన సానబోయిన త్రినాధరావు, చెల్లి మహాలక్ష్మి, కె.కృష్ణమూర్తి, కె.సురేష్, కేబీఆర్ మూర్తి, కేబీటీఎస్ఎస్ మీనాక్షి, కె.సురేష్, బి.పరమేశ్వరరావు, చెల్లి శ్రీరామమూర్తి, సీహెచ్ సత్యనారాయణ, సీహెచ్ లోవరాజు, సీహెచ్ శ్రీను, చెల్లి వెంకటేశ్వరరావు, జి.ప్రసాద్ తదితరులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.



4వ వార్డులో ఉన్న డంపింగ్ యార్డు

రూ.45వేలు ఇంజక్షన్‌తో గుండెపోటుకు అత్యవసర వైద్యం

విపత్కర పరిస్థితుల్లో ఇంజక్షన్

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు వంటి విపత్కర పరిస్థితుల్లో సత్వర వైద్యం పొందినప్పుడే ప్రాణాన్ని నిలబెట్టగలమని జిల్లా వైద్యసేవల సమన్వయకర్త డాక్టర్ కె.కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. ఎవరైనా చాతీలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే 108అంబులెన్సుకు ఫోన్‌చేసి సమీపంలోని సామాజిక ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రి, జిల్లా ఆసుపత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. గుండెనొప్పి లక్షణాలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి గోల్డెన్ అవర్ (మొదటి గంట)లో రూ.45వేలు విలువైన తెనెక్టీప్లేస్ ఇంజక్షన్ ఉచితంగారోగికి అందిస్తారని చెప్పారు. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో సైతం ఇంజక్షన్‌తో పాటు వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు తెలిపారు. మంగళవారం ఏరియా ఆసుపత్రిలో వైద్య సిబ్బందికి స్టెమీ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్టెమీ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే జిల్లాలో 45మందికి, ఏరియాఆసుపత్రిలో ఐదుగురు గుండె జబ్బు లక్షణాలున్న పేషెంట్లకు తెనెక్టీప్లేస్ ఇంజక్షన్ ఉచితంగా అందించినట్లు కార్తీక్‌రెడ్డి తెలిపారు. ఆర్ఎంవో డాక్టర్ కె.అనూష, నర్సింగ్ సూపరిండెంటెంట్ సీహెచ్ వెంకటలక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



స్టెమీ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న డీసీహెచ్ఎస్ కార్తీక్‌రెడ్డి

ఆక్రమణలో మురమళ్ల శ్మశానవాటిక

పట్టించుకోని అధికారులు



మురమళ్ల శ్మశానవాటికలో నిర్మిస్తున్న షెడ్

ఐ.పోలవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ పుష్కర్‌ఘాట్ సమీపంలో ఉన్న శ్మశానవాటిక ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మూడు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. శ్మశానంలో ఒక వ్యక్తి ప్రైవేటుగా షెడ్ నిర్మిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురమళ్ళ, కొమరగిరి, పశువుల్లంక గ్రామాల ప్రజలకు ఈశ్మశానవాటికే అంత్యక్రియలకు ఆధారం. శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరిస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో టీడీపీ హయాంలో రూ.4లక్షలతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీకేంద్రాన్ని తొలగించారని అంటున్నారు. గ్రామానికి పారిశుధ్య పరంగా ఎంతో ఉపయోగపడే నిర్మాణాన్ని తొలగించినా అధికారులు మౌనం వహించడం వెనుక కారణమేమిటో చెప్పాలని నిలదీస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు తక్షణం స్పందించకపోతే ప్రజాగ్రహం చవిచూడవలసి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు మేలుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.

సీఎంఏ ఫైనల్ ఇయర్‌లో ఆలిండియాలో 2వ ర్యాంకు సాధించిన వాగ్దేవ



రాజోలు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తాటిపాకకు చెందిన వ్యాపారవేత్త లక్కింశెట్టి సోమేశ్వరరావు కుమారుడు వాగ్దేవ సీఎంఏ (కోస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అక్కౌంటెంట్) ఫైనల్ ఇయర్‌లో ఆలిండియాలో 2వ ర్యాంకు సాధించాడు. తండ్రి సోమేశ్వరరావు తాటిపాకలో శ్రీరాఘవేంద్రస్వామి బిల్డింగ్ మెటీరియల్స్ దుకాణం నిర్వహిస్తున్నారు. తల్లి లక్ష్మి గృహిణి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి, కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు పోశెట్టి సూరిబాబు, అదనపు కార్యదర్శి కాసు శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి లక్కింశెట్టి నానాజీ, లక్కింశెట్టి తాతారావు, యెండూరి పవన్‌కుమార్, లక్కింశెట్టి బాబులు, గమిడి సూరిబాబు, లక్కింశెట్టి రత్నబాబు, పి.కృష్ణారావు, లక్కింశెట్టి సురేష్, లక్కింశెట్టి నాగబాబు అభినందనలు తెలిపారు.

దివ్యాంగుల సర్వేకు కమిటీ

రాజోలు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటా దివ్యాంగుల సర్వే నిర్వహించేందుకు వైద్యులు, న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలతో ఒక కమిటీ నియామకం చేపట్టినట్టు మండల లీగల్ సెల్ కమిటీ చైర్మన్ ప్రమీలరాణి మంగళవారం తెలిపారు. కోర్టు భవనాల సముదాయాల ప్రాంగణంలో సర్వేకు సంబంధించి కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సదరం సర్టిఫికెట్లు, పెన్షన్ మంజూరయ్యేలా కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. న్యాయవాది జి.రజిత, ఐసీడీఎస్ సీడీపీవో రమాదేవి, పారా లీగల్ వలంటీర్లు సురేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించండి

ఐ.పోలవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును గెలిపించాలని టీచర్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి గ్రాడ్యుయేట్లకు పిలుపునిచ్చారు. మండలంలో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. మురమళ్ళ హైస్కూల్, సాయిపబ్లిక్ స్కూల్, శాంతినికేతన్‌స్కూళ్ళలో ప్రచారం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

నరసింహస్వామి పురాణ గాథపై భక్త ప్రహ్లాద నాటకం



భక్త ప్రహ్లాద నాటకం వేస్తున్న సురభి కళాకారులు

అంతర్వేది, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామివారి పురాణ గాథను ఇతివృత్తంగా భక్త ప్రహ్లాద నాటకం భక్తులను ఆకట్టుకుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన భక్త ప్రహ్లాద నాటకం ఆద్యంతం భక్తులను ఆకట్టుకుంది. కళాత్మకమైన అంశాలతో వివిధ రకాల సెట్టింగులతో కళాకారులు వివిధ వేషధారణలతో భక్త ప్రహ్లాద నాటకం ప్రదర్శించారు. లక్ష్మీనరసింహస్వామి వేషధారణ ప్రధాన ఆకర్షణగా నిలిచి రాక్షసులను సంహరించే విధానం పలువురిని కట్టిపడేసింది. ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ ప్రత్యేక దృష్టి సారించి ముప్పర్తి సత్తిరాజు సహకారంతో భారీ సెట్టింగులతో నాటికలను ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయఏసీ వి.సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, గుబ్బల శ్రీను, పినిశెట్టి బుజ్జి, ఆకన బాబ్జినాయుడు, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, జక్కంపూడి మాణిక్యాలరావు, బైరా నాగరాజు, ఉండపల్లి అంజి, చాగంటి స్వామి, కూటమి శ్రేణులు, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిప్మెర్ నూతన డైరెక్టర్‌తో మల్లాడి భేటీ

యానాం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని జిప్మెర్ ఆసుపత్రి నూతన డైరెక్టర్ నేగీతో ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు భేటీ అయ్యారు. పుదుచ్చేరి వెళ్లిన మల్లాడి జిప్మెర్ ఆసుపత్రికి వెళ్లారు. ఈసందర్భంగా నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న నేగిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం మల్లాడిని డైరెక్టర్ నేగీ సత్కరించారు.ఈసందర్భంగా యానాంలో ఉన్న జిప్మెర్ ఆసుపత్రికి సంబంధించిన పెండింగ్ అంశాలపై చర్చించారు. యానాం పర్యటనకు వచ్చి యానాంలో ఉన్న జిప్మెర్ ఆసుపత్రిని సందర్శించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని మల్లాడి కోరారు.

యానాంలో స్వర్ణిమ రథయాత్ర

యానాం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారీస్ యానాంశాఖ ఆధ్వర్యంలో స్వర్ణిమ రథయాత్ర యానాం పురవీధుల్లో మంగళవారం నిర్వహించారు. రథంలో సోమనాథ జ్యోతిర్లింగాన్ని ఉంచి భక్తుల దర్శనం కోసం ఆరేళ్ల నుంచి దేశమంతా రథయాత్ర చేస్తున్నారని యానాం బ్రహ్మకుమారీస్ వరలక్ష్మి, దేవి తెలిపారు. మంగళవారం యానాం చేరుకుందన్నారు. పైడికొండలవారి వీధిలోని బ్రహ్మకుమారిస్ క్షేత్రం వద్ద రథయాత్రను ఎమ్మెల్యే గొల్లపల్లిఅశోక్ ప్రారంభించారు.రథంలోని సోమనాథ జ్యోతిర్లింగాన్ని భక్తులు దర్శించారు.

బీటలు తీసిన వరిచేలో దిగి రైతుల ఆందోళన



దేవగుప్తంలో దాళ్వా చేలో నీరులేక నెరలు తీసిన చేలో దిగి రైతుల ఆందోళన

అల్లవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దాళ్వా వరి సాగుకు సాగునీరు అందక వరి పొలాలు బీటలు తీసి దుబ్బులు పాడవ్వడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు పంటకాల్వల్లో సాగునీటి వంతులు సరిగా పాటించనందునే తమకు నీటి కష్టాలు తప్పడం లేదని ఆరోపిస్తున్నారు. దేవగుప్తం, డి.రావులపాలెం తదితర గ్రామాల్లో పంటకాల్వల్లో నీరు తగ్గి వరి పొలాలు దెబ్బతింటున్నాయి. అధికారుల తీరుకు నిరసనగా రైతులు బీటలు తీసి ఎండుతున్న వరి చేలో దిగి ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్, ప్రజాప్రతినిధులు తమ సాగునీటి ఇబ్బందులు గుర్తించి సాగునీరు విడుదల చేయాలని కోరుతున్నారు. సాగునీరు ఇవ్వకుంటే ఆత్మహత్యలు తప్పవని రైతులు హెచ్చరిస్తున్నారు.

ఫామ్-1 అప్‌డేషన్ ఒత్తిడిని దూరం చేయాలి



ఎంఈవో లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందిస్తున్న అపుస్మా ప్రతినిధులు

మామిడికుదురు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఫామ్-1 అప్‌డేషన్ విషయంపై ఎంఈవో నుంచి ఒత్తిడి వస్తున్న కారణంగా ప్రైవేటు విద్యాసంస్థలు ఒత్తిడికి గురవుతున్నాయని కోనసీమ జిల్లా అపుస్మా అధ్యక్షుడు ఎన్వీ రమణారావు పేర్కొన్నారు. మంగళవారం అపుస్మా ప్రతినిధులు మామిడికుదురు ఎంఈవో లక్ష్మీనారాయణను కలిసి వినతిపత్రం అందించారు. ఫామ్-1 అప్‌డేషన్ విషయమై హైకోర్టును సంప్రదించగా 2011లోనే హైకోర్టు స్టే ఇచ్చిందని, అప్పటి నుంచి స్టే అమలులో ఉందని జిల్లా అధ్యక్షుడు తెలిపారు. ఇటీవల ప్రభుత్వం నుంచి ఒత్తిడి ఎక్కువైన కారణంగా రాష్ట్ర నాయకులు మళ్లీ హైకోర్టును సంప్రదించారని, హైకోర్టు వారు వాదనలు విన్న తరువాత తీర్పును మార్చి6వ తేదీకి వాయిదా వేసినట్టు తెలిపారు. కానీఇటీవల ఎంఈవోల నుంచి ఒత్తిడి వస్తున్న కారణంగా రాజోలు డివిజన్‌లోని ఐదు మండలాల ఎంఈవోలను కలిసి వినతిపత్రాలు అందిస్తున్నట్టు తెలిపారు. జిల్లాసెక్రటరీ టీఎస్సార్ అయ్యప్పనాయుడు, డివిజన్ అధ్యక్షుడు మోకా రత్నంరాజు, ట్రెజరర్ శ్రీనివాస్, సెక్రటరీ చిన్నా, పీవీవీ ప్రసాద్, సుబ్రహ్మణ్యం, గోపాలకృష్ణపాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల విజేతలకు సన్మానం

అంతర్వేది, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయ కల్యాణ మండపం వద్ద జరిగిన కార్యక్రమంలో ఏపీపీ ఈటీఎస్ ఎస్ఏపీఈ అసోసియేషన్ సెమినార్, స్పోర్ట్‌మీట్ రాష్ట్రస్థాయి పోటీల్లో బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్‌లో ప్రథమ స్థానం సాధించిన ఎస్కే బాజీ, కె.సతీష్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లి మండలానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన వారి ఇరువురికి మండల విద్యాశాఖాధికారులు కిశోర్‌కుమార్, వెంకటేశ్వరరావు, విశ్రాంత విద్యాశాఖాధికారి రమణశ్రీ, భాస్కర్, సుభాకర్, కృష్ణప్రసాద్, సుబ్బరాజు అభినందనలు తెలియజేసి అనంతరం సత్కరించారు.

అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లోని అల్వార్‌లో జరిగిన 44వ నేషనల్ మాస్టర్స్ చాంపియన్ షిప్-2025 పోటీల్లో అమలాపురం పట్టణానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. 60ఏళ్ల పైబడిన విభాగంలో జి.గంగరాజు 5కిలోమీటర్ల నడక పోటీలో తృతీయస్థానం సాధించి కాంస్య పతకం దక్కించుకున్నాడు. 30ఏళ్ల పైడిన విభాగంలో రెడ్డి నాగేంద్రకుమార్ వివిధ విభాగాల్లో ఒక స్వర్ణ పతకం, రెండు కాంస్య పతకాలు, ఒక రజత పతకం సాధించాడు. వీరిని అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. వారు థాయ్‌లాండ్‌లో జరిగే మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలో పాల్గొంటారు. గంగరాజు, నరేంద్రకుమార్‌ను మంగళవారం అమలాపురం జిల్లాపరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో సూర్య వాకర్స్ క్లబ్ తరపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొప్పిశెట్టి వెంకట్రావు, చప్పిడి శోభన్‌బాబు, అడపా నాగేశ్వరరావు, కుడుపూడి త్రినాథ్, యనమదల బుజ్జి, తటవర్తి బంగారం తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అభినందన

టైలర్ల సమస్యలపై ఎమ్మెల్యేలకు వినతి



ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు వినతిపత్రం అందజేస్తున్న టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): టైలర్ల ఫెడరేషన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శ్రీబాలయోగి టైలర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నాయకులు బండారు శ్రీనివాస్‌లకు మెమొరాండం అందించారు. ఎమ్మెల్యేలతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా టైలర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే బండారు, జనసేన నాయకులు శ్రీనివాస్‌లను కలిసి టైలర్ల సమస్యలను వారికి మొర పెట్టుకుని టైలర్ ఫెడరేషన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని వారికి మెమొరాండం అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొంగ సత్యనారాయణమూర్తి, మహిళా అధ్యక్షురాలు గొలుగూరి వసంతలక్ష్మి, అడపా లక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ కడలి వెంకటేశ్వరరావు, జిల్లా సలహా మండలి వైస్‌చైర్మన్ పి.అమరారావు, ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి నాయుడు, నాయకులు నాగేశ్వరరావు, కాండ్రేగుల వెంకటేశ్వరరావు, రాము, పి.ధర్మారావు, నామాల వెంకటేశ్వరరావు, గెద్దాడ తాతారావు, రామచంద్రరావు, దొమ్మేటి శ్రీను, బొంతు కృష్ణ, బాషా, శీలం ప్రసాద్, పట్టా సముద్రుడు, మడికి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అనధికార బొండు ఇసుక తవ్వకాలు పరిశీలన



మానేపల్లి బొండు ఇసుక ర్యాంపులో పరిశీలన చేసిన మైన్స్, హెడ్‌వర్క్స్, రెవెన్యూ అధికారులు

పి.గన్నవరం, ఫిబ్రవరి 11(ఆంధ్ర జ్యోతి): మానేపల్లి గ్రామపరిధిలో అనాధికారికంగా తవ్వకాలు జరుపుతున్న బొండు ఇసుక ర్యాంపును మైన్స్ అధి కారులు మంగళవారం పరిశీలించారు. 1625 క్యూబిక్ మీటర్లు మేర తవ్వకాలు జరిగినట్లు గుర్తించినట్లు తెలిపారు. అలాగే బొండు ఇసుక ర్యాంపు సమీపంలో మొండెపులంక గ్రామ పరిధి కొబ్బతోటలో ఉన్న ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. పరిశీలనలో మైన్స్ అర్‌ఐ సుజాత, టెక్నికల్ అసిస్టెంట్ రెహమనాన్‌ఆలీ, సర్వేయర్ కె.శ్రీధర్, ఆర్‌ఐలు వి.సత్యనారాయణ, ఎన్.రత్నకుమారి, సిబ్బంది ఉన్నారు. ఇప్పటికే గన్నవరంలో జరుగుతున్న ఇసుక, తువ్వమట్టి అక్రమ తవ్వకాలపై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు కూడా వెలువడ్డాయి. మండలంలోని ర్యాంపులన్నీ దాదాపుగా మూసుకుపోయాయి. ఇటీవల మండలంలో ఇసుక, తువ్వమట్టి ర్యాంపులు ఏర్పాటు కోసం జేసీ నిశాంతి పరిశీలన చేసి అధికారులు నుంచి నివేదికలు కోరారు. ఇంకా ర్యాంపులు ఏర్పాటు చేయకుండానే కందాలపాలెం దిగువున మానేపల్లి లంక పరిధిలోని మళ్లీ బొండుఇసుక తవ్వకాలు మొదలుపెట్టారు.

పంట కాల్వలో తూడు, గుర్రపు డెక్క తొలగింపు

అల్లవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కొత్తగా నీటి సంఘాలు ఏర్పడిన తర్వాత పంట కాల్వల్లో అడ్డంకుల తొలగింపుపై శ్రద్ధ పెంచుకున్నారు. గోపాయిలంక నుంచి అల్లవరం మీదుగా డి.రావులపాలెం వెళ్లే 5.8కిలోమీటర్ల పొడవునా ప్రధాన పంటకాల్వలో తూడు, గుర్రపుడెక్క మూసుకుపోయి సాగునీటి సరఫరాకు అడ్డంకిగా మారడంతో మంగళవారం తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. గతంలో సార్వాలో ఒకసారి తూడు, గుర్రపుడెక్క తొలగించగా మరలా మూసుకుపోవడంతో దాళ్వా సాగులో ఇబ్బందులు తొలగించేందుకు పనులకు శ్రీకారం చుట్టారు. గోపాయిలంక నుంచి అల్లవరం వరకు కిలోమీటరు పొడవునా అడ్డంకులు తొలిగాయి. మిగిలినవి పూర్తి చేస్తామని ఇరిగేషన్ సిబ్బంది తెలిపారు. గోడిలంక నీటి సంఘం అధ్యక్షుడు బొక్కా నాగశివప్రసాద్, ఇరిగేషన్ అసిస్టెంట్ పీవై శామ్యూల్ దగ్గరుండి పనులు చేయిస్తున్నారు. కంకిపాటి వీరబాబు, బండిగుప్తాపు వీరపండు, బండిగుప్తాపు వెంకటేశ్వరరావు, రైతులు వారి వెంట ఉన్నారు.

బీవీసీలో చైతన్య సదస్సు

అల్లవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బోనం వెంకటచలమయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 3వ సంవత్సరం విద్యార్థులకు మోడలింగ్ అండ్ సిమ్యులేషన్‌లో వినూత్న ధోరణులపై అవగాహన సదస్సు జరిగింది. అమెరికా విస్కాన్సన్ మాడిసన్ యూనివర్సిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివరుద్రరాజు పరిశోధనా రంగంలో మార్పులపై వివరించారు. విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేయాలనుకునే విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా రుద్రరాజు రామకృష్ణంరాజును సన్మానించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మహేశ్వర్, డాక్టర్ ఐఐసీ అధ్యక్షుడు డాక్టర్ ఎ.రామకృష్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.ప్రవీణ్, డాక్టర్ బీవీ రామన్, వైవీ రమణమూర్తి, కేబీఎస్వీ శర్మ, ఏవైఆర్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఓటర్లను అభ్యర్థించారు. ముక్కామల, ఇరుసుమండ గ్రామాల్లో పట్టభద్రులను కలిసి ఓటును అభ్యర్థించారు. నియోజకవర్గ అబ్జర్వర్ షేక్ సుభాన్, కోకన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ, సర్పంచ్ జల్లి బాలరాజు, నాయకులు గణపతి వీరరాఘవులు, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, సుంకర బాలాజీ, అక్కిశెట్టి ప్రసాద్, యనమదల రాజబాబు, అక్కిశెట్టి పెద్ద, సుంకర రామదాసునాయుడు, మానేపల్లి శ్రీను, సుంకర గణపతిరావు, నాగాబత్తుల సుబ్బారావు పాల్గొన్నారు.

దొంతికుర్రులో ఎన్నికల ప్రచారం

కాట్రేనికోన, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దొంతికుర్రు పంచాయతీ సీతమ్మచెరువు, మెయిన్‌రోడ్, మర్లచెరువు తదితర ప్రాంతాల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లు, హైస్కూల్ ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులను కలిసి కూటమి ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలని కోరారు. యనమదల వెంకటరమణ, వెంట్రు సుధీర్, విత్తానాల వెంకటరమణ, కాగిత భగవాన్, కాశి నరేష్‌బాబు, భీమవరపు శ్రీనివాస్, కాశి జ్యోతిబాబు, కడలి వెంకటసత్యనారాయణ, కడలి నాగరాజు, వాసంశెట్టి సుబ్రహ్మణ్యం, సంసాని గంగాధర్, అయితాబత్తుల శివ, జనిపల్లి మహేంద్ర, కాశి ప్రసాద్, కొండయ్య పాల్గొన్నారు.

పి.గన్నవరంలో ప్రచారం

పి.గన్నవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్ పిలుపునిచ్చారు. పి.గన్నవరం గ్రేస్ డిగ్రీ కళాశాలలో టీడీపీ యువతతో కలిసి ప్రచారం నిర్వహించి అనంతరం మాట్లాడారు. అలాగే కె.ముంజవరంలో టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు మట్టపర్తి రామకృష్ణ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గుత్తుల రామకృష్ణ, నిమ్మకాయల శేషయ్య, తవిటికి బుజ్జి, యల్లమిల్లి నాగేంద్ర, పెదపూడి రాము, ముషిణి వెంకటేష్, నాగు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌ను గెలిపించాలి

అయినవిల్లి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి గెలిపించాలని మంగళవారం కూటమి నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. కూటమి నాయకులు అక్కిశెట్టి దుర్గారావు, పెంద్ర రమేష్, కుప్పాల రాంబాబు, కోరిపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేయాలి

మలికిపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం లక్కవరం ఎంజీ గార్డెన్స్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశీలకురాలు, మాజీ మంత్రి పీతల సుజాత మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గం నుంచి రాజశేఖర్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలన్నారు. మాజీ ఎమ్మెల్యే వేమా, రెడ్డి అనంతకుమారి, చిటికెల రామ్మోహనరావు, గుబ్బల శ్రీనివాస్, గుండుబోగుల పెద్దకాపు, అడబాల సత్యనారాయణ, మంగెన భూదేవి, అడబాల యుగంధర్, చాగంటి స్వామి, కేతా శ్రీనివాస్, తాడి మోహన్, గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్, అడబాల రాంబాబు, భూపతిరాజు సాయిబాబురాజు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): చిరతపూడిలో ఉన్న శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఎల్ఆర్‌కే మూర్తి, కోశాధికారి ఇళ్ళ ఏడుకొండలు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మంత్రోచ్ఛారణతో మామిడిశెట్టి వెంకటరత్నం, చింతపల్లి వీరాంజనేయులు-సోమాలమ్మ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.


ఉచిత వైద్య శిబిరం

అంబాజీపేట, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గంగలకుర్రు మోరంవారిపాలెం వద్ద ఉన్న రిసార్ట్స్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాల్, అరిగెల బలరామమూర్తి ఆధ్వర్యంలో మెడివిన్ ఆసుపత్రి వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 10మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపికచేయగా 30మందికి కళ్లజోళ్లు అందించారు. మద్దెల వెంకటేశ్వరరావు, బెహరా హనుమంతరావు, జంపన సుమన్‌వర్మ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వీఆర్వోకు పతకాలు

పి.గన్నవరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా పోలీస్ ట్రైనింగ్ కళాశాల (పీటీసీ) గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వై.కొత్తపల్లి వీఆర్వో తాతపూడి అబ్బులు షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్, హెమర్ త్రోలో బ్రాంజ్‌మెడల్ సాధించాడు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సహచర వీఆర్వోలు సమక్షంలో వీఆర్వో అబ్బులను తహశీల్దార్ పి.శ్రీపల్లవి సన్మానించారు. డిప్యూటీ తహశీల్దార్ ఎం.సత్యనారాయణ, ఆర్ఐ వి.డాంగి, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ స్వామిజీరావు, వీఆర్వోలు పి.నరసింహరావు, శివరామకృష్ణ, దొరబాబు, రమేష్, దుర్గ, పద్మావతి, వీఆర్ఏలు కె.రాజు, ఏ.శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యూజెరూసలేం చర్చి ఫాదర్ దానియేలు మృతి



పి.గన్నవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కందాలపాలెం న్యూజెరూసలేం చర్చి ఫాదర్ జి.దానియేలు మంగళవారం ఆకస్మిక మృతిచెందారు. గన్నవరంలో నూతన చర్చిను ప్రారంభించేందుకు కారు డ్రైవర్ లేకపోవడంతో అల్లుడు కరుణకుమార్‌తో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ప్రధాన రహదారిపైకి వచ్చేసరిసి ఎదురుగా వాహనం వస్తుందని సడన్ బ్రేక్ వేయడంతో ద్విచక్ర వాహనంపై నుంచి దానియేలు కిందిపడి పోయారు. కళ్లకు బలమైన గాయం కావడంతో పోటు గుండెనొప్పి రావడంతో కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దానియేలు కొన్ని ఏళ్లుగా ప్రతి శుక్రవారం కందాపాలెంలో చర్చి నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, కుమార్తు, కుమార్తె ఉన్నారు.

పంపుహౌస్ పరిశీలన

యానాం, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): యానాం ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు త్రాగు, సాగు నీరు అందించే పంపుహౌస్‌లను యానాం పరిపాలనాధికారి మునిస్వామి పరిశీలించారు. కొద్ది రోజులుగా యానాం ప్రజలకు త్రాగు, సాగునీటి కొరత ఉండటంతో నీటి విడుదలకు ఇటీవల కాకినాడ జిల్లా కలెక్టర్‌ను కలిసిన విషయం తెలిసిందే. దీనికి తోడు స్థానిక ఎమ్మెల్యే రైతులతో కలిసి ఆర్ఏ మునిస్వామిని కలిసి వారి సమస్యలను పరిష్కరించాలని కోరండం జరిగింది. ఈనేపథ్యంలో ప్రజాపనుల శాఖ అధికారులతో కలిసి పిల్లంక నుంచి యానాం వచ్చే కాలువలను, అరటికాయలంక వద్ద గల పంపుహౌస్‌లను పరిశీలించారు.

నేడు గరుడ పుష్పక వాహనంపై గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం తెల్లవారుజామున 3నుంచి 6గంటల వరకు సుప్రభాతసేవ అనంతరం శ్రీస్వామివారి తిరువారాధాన, బాలభోగం, పొలమూరివారి సత్రం సౌజన్యంతో వార్షిక అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 8గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు రుద్రరాజు బంగారమ్మ వారితో నిర్మితమైన గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుంది.

భీమరాజు సహకారంతో తెప్పోత్సవం

ప్రతి సంవత్సరం తెప్పోత్సవానికి అయ్యే ఖర్చును భీమవరానికి చెందిన గొట్టిముక్కల భీమరాజు విరాళంగా ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం సాయంత్రం స్వామివారి ఆలయ ఉత్తర ఈశాన్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన చెరువులో మిరిమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణల నడుమ హంస వాహనంపై స్వామివారి తెప్పోత్సవం జరుగుతుంది.

ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీవో అఖిల..

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా చివరి ఘట్టాలైన బుధవారం చక్రస్నానం, వసంత మండపం ఏర్పాట్లను ఆర్డీవో అఖిల పరిశీలించారు. గురువారం సాయంత్రం 6గంటలకు జరిగే స్వామివారి తెప్పోత్సవం ఏర్పాట్లను కూడా ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇప్పటికే ఆలయం వద్దకు తెపోత్సవానికి సంబంధించిన సామగ్రి చేరిందని, ఏర్పాట్లకు సిద్ధమైందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.మురళీమోహన్, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, కూటమి శ్రేణులు, ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సేవా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేరికలతో కాంగ్రెస్ పార్టీ బలోపేతం: చిట్టిబాబు

మామిడికుదురు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలోకి నూతనంగా చేరిన వారితో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరం పార్టీ కార్యాలయంలో మంగళవారం వైసీపీ నుంచి అల్లవరానికి చెందిన బొంతు విజయ్‌కుమార్, వాసంశెట్టి వెంకటేశ్వరరావు, ఉప్పలగుప్తానికి చెందిన నడింపల్లి సుబ్బరాజు, పండు రవికుమార్‌లు వైసీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారికి చిట్టిబాబు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పెట్రోల్ సీసాలో పాలు తాగిన ఇద్దరికి అస్వస్థత

ముమ్మిడివరం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): చెయ్యేరుగున్నేపల్లి నల్లావారిపేట సబ్బతి రాంబాబు పెట్రోల్ సీసాలో వేసిన పాలు తాగి ఆసుపత్రి పాలయ్యాడు. పాలుపోసే వ్యక్తి మంగళవారం బాటిల్‌తో పాలు తేగా ఆ పాలు కాచుకుని టీ తాగిన కొద్దిసేపటికి రాంబాబు వికారం, వాంతులు, విరోచనాలకు గురికావడంతో ముమ్మిడివరంలోని ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయించాడు. పాలు పోసిన బాటిల్‌ను పరిశీలిస్తే పెట్రోలు పోసే బాటిల్‌గా గుర్తించారు. దీంతో రాంబాబు టీ తాగి స్వల్ప అస్వస్థతకు గురయ్యాడు. అతనితో పాటు టీ తాగిన గుబ్బల వెంకటేశ్వరరావు కూడా స్వల్ప అస్వస్థతకు గురవ్వడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది.



పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనరు రంగారావు

'మండపేటను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిద్దుదాం'

మండపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండపేటను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనరు టీవీ రంగారావు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా మంగళవారం ఆయన పారిశుధ్య కార్మికులతో కలిసి వార్డుల్లో పర్యటించారు. తడి, పొడి చెత్తలను వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఉద్యాన పంటలు సాగు చేసుకోవాలన్నారు. తడి, పొడి చెత్తలతో కంపోస్టు ఎరువు తయారు చేసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించి ప్లాసిక్ వస్తువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



అన్నదాన భవన నిర్మాణానికి విరాళం అందిస్తున్న సతీష్‌కుమార్ కుటుంబీకులు

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.12 లక్షలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామిని మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన వారు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,12,629 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురానికి చెందిన కైలా సతీష్‌కుమార్-లావణ్య దంపతులు రూ.51,116 విరాళం అందజేశారు.



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పామర్రు విద్యార్థుల ప్రతిభ

కె.గంగవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్ప్రింట్ మానియా అథ్లెటిక్స్ పోటీల్లో పామర్రు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అండర్-16 బాలికల విభాగంలో ఎ.జ్వాలా వీరకుమారి స్వర్ణ పతకం, పి.ధరన్ రజత పతకం సాధించారు. బెస్ట్ అథ్లెటిక్ విభాగంలో జ్వాలా వీరకుమారికి స్వర్ణ పతకంతో పాటు రూ.7,500 నగదు బహుమతి అందుకుంది. విజేతలను ఎస్ఎంసీ ఛైర్మన్ వై.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.



శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో సర్పంచ్ వెంకటరెడ్డి

దేశానికి రైతే వెన్నుదన్ను

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశానికి రైతులే వెన్నుముక అని కేదార్లంక సర్పంచ్ వీధి వెంకటరెడ్డి అన్నారు. ఉద్యాన పంటలపై గత నాలుగు నెలలుగా క్షేత్రస్థాయిలో శిక్షణ పొందిన తాడేపల్లిగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులకు మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సత్కార సభ నిర్వహించారు. విద్యార్థులతో పాటు వారికి తోడ్పడిన అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు నీరజ, కోటేశ్వరరావు, విశ్వనాథ్‌లను శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, పోలిశెట్టి గణేష్, వీధి ప్రసాద్, సాధా రవిభాస్కర్, రంకిరెడ్డి వెంకటేశ్వరరావు, వీధి గంగాధర్, సాధా ధనరాజ్, మారిశెట్టి చంటి, యర్రంశెట్టి కామరాజు. అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు

ఏడిద హైస్కూల్ హెచ్ఎం ఎంపిక

2మండపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఇటీవల జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని ఏడిద జిల్లా పరిషత్ హైస్కూలు హెచ్ఎం ఎం.వెంకట్రాజు సత్తా చాటారు. 55ప్లస్ విభాగంలో 100, 200 మీటర్ల పరుగు పందెంలో రన్నరప్‌గా నిలిచి బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎంను డీఈవో షేక్ సలాంబాషాతో పాటు పలువురు అభినందించారు. జాతీయ స్థాయిలోనూ విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. రామచంద్రపురం డీవైఈవో పి.లక్ష్మణమూర్తి, హెచ్ఎంల అసోసియేషన్ అధ్యక్షుడు మోకా ప్రకాష్, ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఈ-శ్రమ్‌తో బహుళ ప్రయోజనాలు

ఆలమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగాల కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ ఉపాధి పథకాలను చేరువ చేసేందుకు ఈ- శ్రమ్ పథకం ఉపకరిస్తుందని మండపేట కార్మిక శాఖ అధికారి కేఎన్ మల్లేశ్వరరావు పేర్కొన్నారు. ఆలమూరులోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులు, యజమానులకు మంగళవారం ఆయన పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇటుకల బట్టీల్లో పని చేస్తున్న కార్మికుల వివరాలతో కూడిన రికార్డులను విధిగా నిర్వహించాలని సూచించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోకూడదన్నారు.

రేపు మెగా సాఫ్ట్‌వేర్ జాబ్‌మేళా

రామచంద్రపురం (ద్రాక్షారామ), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహిస్తున్న మెగా సాఫ్ట్‌వేర్ జాబ్‌మేళాను 25 ఐటీ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, 300 మందికి ఉద్యోగాలు కల్పనే ధ్యేయమన్నారు. బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ ఉత్తీర్ణులు అర్హులని, ముందుగా పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.





మహా శివరాత్రి ఉత్సవాల్లో చేసే ఏర్పాట్లను వివరిస్తున్న ఈవో భీమశంకరం, అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో అఖిల

మహా శివరాత్రి ఉత్సవాలను సమన్వయంతో విజయవంతం చేద్దాం

సామాన్య భక్తులకు సంతృప్తికర దర్శనం కల్పిద్దాం: కోటిపల్లిలో అధికారులతో సమీక్షలో రామచంద్రపురం ఆర్డీవో అఖిల

కె.గంగవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం కోటిపల్లిలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు, రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల కోరారు. ఛాయాసోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉత్సవాల నిర్వహణపై మంగళవారం ఆమె పలు శాఖల అధికారులతో సమీక్షించారు. దైవ దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు సంతృప్తికరంగా దర్శనం కలిగేలా చూడాలన్నారు. వీఐపీ దర్శనాల పేరుతో వారికి ఇబ్బంది కలిగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయం లోపల క్యూలైన్లు, టెంట్లు, విద్యుద్దీపాలంకరణ, అన్నప్రసాద వితరణ ఏర్పాట్లు చేయాలన్నారు. బ్యాంకు కెనాల్‌లో నీటి లెవెల్స్ తగ్గకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. నాలుగు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు నిరంతరం తాగునీరు అందించాలన్నారు. స్నానఘట్టాల వద్ద బారికేడింగ్, గజ ఈతగాళ్లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక షెడ్లు, విద్యుద్దీపాలు, జల్లు స్నానానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవాల మూడు రోజులూ నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఫైర్ ఇంజన్‌ను అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ అధికారులు తగినన్ని బస్సులు నడపాలని సూచించారు. డీఎస్పీ బి.రఘువీర్ మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని స్నానఘట్టాల వద్ద ఎక్కువ మంది జల్లుస్నానం చేసేలా చూడడంతో పాటు గజ ఈతగాళ్లు, నావలు, లైఫ్ జాకెట్లు సమకూర్చాలన్నారు. వాహనాల పార్కింగ్ ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పెమ్మాడి బేబీ, ఆలయ తనిఖీ అధికారి బాలాజీ రామ్‌ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సీఐ వెంకటనారాయణ, ఎస్ఐ జానీబాషా, ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు, కూటమి నాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, రేవు శ్రీను, గొడవర్తి రామకృష్ణ, చీకట్ల సోమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీఅభ్యర్థి రాజశేఖరానికి మద్దతుగా ప్రచారం

ఆలమూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి బలపరిచిన పేరాబత్తుల రాజశేఖరాన్ని భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా జనసైనికులు పనిచేయాలని జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆలమూరులో మంగళవారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో మండల శాఖ అధ్యక్షుడు సూరపురెడ్డి సత్య, నాయకులు గారపాటి శ్రీనివాస్‌చౌదరి, గారపాటి త్రిమూర్తులు, సలాది జయప్రకాష్‌నారాయణ, కొత్తపల్లి నగేష్, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, తోరాటి వెంకటేశ్వర్లు, నల్లా వెంకన్న, సిరిగినీడి పట్టాభి, చల్లా వెంకటేశ్వరరావు, చల్లా బాబీ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం (ద్రాక్షారామ) (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలని కోరుతూ మంగళవారంరాత్రి 21వ వార్డులో ఎన్నికల పరిశీలకుడు గన్ని కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో కూటమి నాయకులు ప్రచారం నిర్వహించారు. టీడీపీ రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావు, పట్టణ శాఖ అధ్యక్షుడు కడియాల రాఘవన్, గుణ్ణం వినోద్‌కుమార్, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కట్టా నాగేశ్వరరావు, కౌన్సిలర్ అంకం శ్రీనివాస్, నాయకులు గ్రంధి రాజు, కంచుమర్తి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ మంగళవారం ర్యాలీ జడ్పీ హైస్కూల్లో ప్రచారం చేశారు. పేరాబత్తులకు మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు.





కె.గంగవరం, ద్రాక్షారామల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులు

'వీఆర్వోలకు గ్రేడులు తొలగించాలి'

కె.గంగవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ అధికారుల గ్రేడులను తొలగించి అందరికీ తహసీల్దారే డీడీవోగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వీఆర్వోలు డిమాండ్ చేశారు. మంగళవారం వారు తహసీల్దారు బండి మృత్యుంజయరావును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వీఆర్వోల సంఘ నాయకులు దూలం నాగేశ్వరరావు, పామర్తి రామారావు, వెంకటేశ్వరరావు, మాగాపు వీరభద్రరావు, మార్ని సుబ్బలక్ష్మి, ఎస్వీవీ సత్యనారాయణ, కొమ్ము స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలకు గ్రేడులు తొలగించి అందరికీ తహసీల్దార్‌నే డీడీవోగా కొనసాగించాలని రామచంద్రపురం వీఆర్వోల సంఘం ప్రతినిధులు తహసీల్దారుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సంఘ అధ్యక్షుడు పంపన విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శి డి.నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెద్దింట్లమ్మ అమ్మవారి

ఆలయ వార్షికోత్సవాలు

రావులపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని భద్రకాళమ్మ పుంత రోడ్డులో ఉన్న పెద్దింట్లమ్మ అమ్మవారి 6వ వార్షికోత్సవాలను బుధవారం నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం అమ్మవారికి విశేష అభిషేకం, అలంకరణ, గరగ నృత్యాలతో జాతర, 13న చామంతి పూలతో సహస్రనామ పూజ, 14న చండీ హోమం, పూర్ణాహుతి, 15న అమ్మవారి సన్నిధిలో శ్రీఅభంజనేయస్వామికి అభిషేకం, సహస్ర తమలపాకుల పూజ, 16న ప్రజల ఆరోగ్యం, ఐశ్వర్య ప్రాప్తికై సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ సుదర్శన హోమం, 17న పెద్దింట్లమ్మ అమ్మవారి సన్నిధిలో వీరభద్రస్వామికి బోనం, ఊరేగింపు, అదేరోజు ఉదయం అన్నసమారాధన జరుగుతాయి.



సత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ర్యాలి సత్తెమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నసమారాధన జరిపారు. సమితి మాజీ అధ్యక్షుడు మద్దూరి సుబ్బారావు, పెండెం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



అయోడిన్ లోపం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న దృశ్యం

అయోడిన్ లోపంపై అవగాహన

రావులపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊబలంకలో అంకమ్మ, మహాలక్ష్మి కల్యాణ మండపంలో ఢిల్లీకి చెందిన ఇనిస్టిట్యూట్ ఫర్ గ్లోబెల్ డవలెప్‌మెంట్ ప్రతినిధులు అయోడిన్ లోపంపై అవగాహన కల్పించారు. ఐజీడీ కోనసీమ జిల్లా కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో ఐదు మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ఆశీర్వాద స్మార్ట్ ఇండియా ఆర్థిక సాయంతో చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఏలూరు ఆశ్రమ్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ శ్రవణ్ అయోడిన్ లోపం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను వివరించారు. రావులపాలెం, ఆలమూరు అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఫాతిమా, అరుంధతి, హిమశ్రీ, లక్ష్మి, సత్యవేణి, సుబ్బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీలో మంగళవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా 25 మంది గర్భిణులను పరీక్షించి మందులు అందజేశారు. ఇద్దరిని హైరిస్క్‌గా గుర్తించి స్థానిక సీహెచ్‌సీకి రిఫర్ చేసినట్టు వైద్యాధికారిణి రత్నకుమారి తెలిపారు. ఎంపీహెచ్ఈవో జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు హెచ్‌వీ టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆలమూరు (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష పథకంలో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు సువర్చలానాయుడు, సాయికిషోర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. బాలింతలు, గర్భిణులు 113మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొబ్బర్లంకలో అభయాంజనేయస్వామి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్‌కు లక్ష తమలపాకుల పూజ, గంధ సింధూరంతో అభిషేకం చేశారు. వేద పండితులు ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు సంజీవ్ స్వామి వారిని దర్శించుకుని అన్నసమారాధనలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆకుల రామకృష్ణ, సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మీవెంకన్న, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు విజయదుర్గా పీఠంలో మాఘ పౌర్ణమి పూజలు

రాయవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో బుధవారం మాఘ పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్టు అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చన, భవానీశంకర అష్టలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపి లలితా అష్టోతర్శ, సహస్రనామాలు, లక్ష్మి, సరస్వతి, దుర్గా అష్టోత్తరాలతో మహిళలచే సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. నవగ్రహ నక్షత్ర హోమం, పూర్ణాహుతి జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తామని వివరించారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రావులపాలెం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం రావులపాలెం నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజరు రమణ తెలిపారు. అంతర్వేది, అన్నవరం, ద్రాక్షారామలకు బస్సులు వెళ్తాయన్నారు.



సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేర్లు తొలగింపు

కె.గంగవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ప్రచార పిచ్చిలో భాగంగా రైతుల పొలాల్లో వేసిన సర్వే రాళ్లపై ఉన్న జగన్ బొమ్మలను రెవెన్యూ అధికారులు తొలగిస్తున్నారు. మండలంలో 40వేల రాళ్లపై పేర్లు, బొమ్మలు తొలగించాల్సి ఉందని తహసీల్దారు మృత్యుంజయరావు తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు మురళీ, శ్రీరామ్ ప్రసాద్, ఆర్ఐ వెంకట్రావు పర్యవేక్షణలో ఇప్పటివరకు 15 వేల రాళ్లపై జగన్ బొమ్మ తొలగించామని ఆయన వివరించారు.

గుండెపోటు వ్యాధిపై అవగాహన

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు నివారణకు ఉచిత ఇంజక్షన్ కపిలేశ్వరపురం సీహెచ్‌సీలో అందుబాటులో ఉందని సూపరింటెండెంట్ డాక్టర్ పి.రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన సీహెచ్‌సీలో మండలంలోని ఏఎన్ ఎంలు, ఆశా వర్కర్లకు గుండెపోటు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఎం.దుర్గాదేవి, డాక్టర్ కె.శ్రావణి, డాక్టర్ సీహెచ్ రాజీవ్, ఆసుపత్రి సిబ్బంది, అంగర, టేకి, తాతపూడి, శ్రీరామపురం, మాచర గ్రామాల ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు గరుడ పుష్పక వాహనంపై గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం తెల్లవారుజామున 3 నుంచి 6 గంటల వరకు సుప్రభాతసేవ అనంతరం శ్రీస్వామివారి తిరువారాధన, బాలభోగం, పొలమూరివారి సత్రం సౌజన్యంతో వార్షిక అభిషేకాలు నిర్వహిస్తారు. ఉదయం 8 గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు రుద్రరాజు బంగారమ్మ వారితో నిర్మితమైన గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరుగుతుంది.